ఆంధ్రప్రదేశ్ ఆల్ ఎస్సీ ఎస్టీ ఫెడరేషన్ నూతన కమిటీ నియామకం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ఆల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ సంఘం రాష్ట్ర నూతన కార్య వర్గమును ఆ సంఘం వ్యవస్థాపకులు వైకుంఠ రవిచంద్ర ఆదేశాల మేరకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వైయస్సార్ ప్రెస్‌క్లబ్ నందు ఆల్ ఎస్సీ, ఎస్టీ ఫెడరేసన్ సంఘం రాష్ట్ర మహిళ కమిటీ అధ్యక్షురాలుగా కోటిపాటి సుబ్బమ్మకు నియామకపత్రం ఇచ్చి ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేటి నుండి ఆల్ ఎస్సీ ఎస్టీ ఫెడరేషన్ అధ్వర్యంలో కుల, మతాలు అతీతంగా ఆంధ్రప్రదేశ్ లోని దళిత, గిరిజన, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఏజెండాగా ఆ విధంగా సంఘం సభ్యులందరూ కలసి పోరాడాలని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైన కొత్తపాటి సుబ్బమ్మకి, మహిళా కమిటీ సంఘం సభ్యులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంఘం తరపున రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఎన్నికైనా కోటిపాటి సుబ్బమ్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ ప్రజలకు ఎక్కడ న్యాయము జరిగిన వారిపక్షాన నిలిచి వారి సమస్యలను పరిష్కరించబడే వరకు కమిటీ సభ్యులందరితో కలసి సమస్యలపై పోరాడాతానని తెలిపారు. నాపై నమ్మకంతో మాకు ఈ అవకాశం ఇచ్చిన ఏఎస్ఎఫ్ వ్యవస్థాకులు వైకుంఠ రవిచంద్ర జనరల్ బాడీ సభ్యులకు, నా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమిటీ అధ్యక్షలు సొరకాయల వెంకటస్వామి, ఆనంతపురం జిల్లా అధ్యక్షులు, పెనుగొండ నాగభూషణం, కడప మహిళా గౌరవ అధ్యక్షురాలు రెహమాత, ప్రొద్దుటూరు మహిళా అధ్యక్షురాలు దస్తగిరమ్మ, దళిత, గిరిజనులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారస్తుల నిరసన :ఏఐటియుసి

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరంలో దిశా పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు ప్రక్కన బుట్టలలో జామ, బొప్పాయి, సపోట పండ్లను పెట్టుకుని అమ్మకాలు జరుపుకొని కుటుంబాలు పోషించుకుంటూ వస్తున్న చిరు వ్యాపారస్తులను ట్రాఫిక్ పోలీసులు నిబంధనల పేరుతో అమ్మకాలు నిలుపుదల చేయడం బాధాకరంగా ఉందని శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే.సి.బాదుల్లా మాట్లాడుతూ 10 సంవత్సరాల పైబడి అక్కడే చిరువ్యాపారాలు చేసుకుంటూ వస్తున్నారని తెలిపారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు 2014లో చట్టాన్ని తీసుకొచ్చి చిరు వ్యాపారస్తులకు జనావాసాల మధ్య వ్యాపారాలు నిర్వహించుకుంద నేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాలకు ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ట్రాఫిక్ సిఐ నిబంధనల పేరుతో కాళీ చేయాలని సూచిం చగా నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యామ్నాయం చూపించే వరకు వ్యాపారాలు చేసుకోవాలని సూచించిన ట్రాఫిక్ సిఐ మాత్రం ఒప్పుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు పి చంద్రశేఖర్, నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు, ఇన్సాఫ్ నగర కార్యదర్శి ఎస్.మైనుద్దీన్ పాల్గొన్నారు.

శతాబ్దపు నైపుణలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - వల్లూరు : శతాబ్దపు నైపుణ్యాల పై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్‌సిఏఆర్‌టి జిల్లా మేనేజర్ లక్ష్మీనరసింహుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నందు ఎస్సీఈఆర్టీ సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు 21 శతాబ్దపు నైపుణ్యాల గురించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థాపక మనస్తత్వమును అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థులకు మార్చిన జరగబోయే ప్రాజెక్ట్ ఎక్స్పో గురించి పిల్లలకి అవగాహన కల్పించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు శతాబ్దాల గురించి తెలుసుకోవడం వల్ల వ్యవస్థాపకత ఆకాంక్ష మరియు అత్యుత్తమ ఎంపిక చేసే సామర్థ్యాలను పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎల్ గాయత్రి మాట్లాడుతూ సమస్య పరిష్కార పరిశోధన అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు విద్యార్థులు వారు తయారు చేసినటువంటి ప్రాజెక్ట్ ని ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించడం జరిగింది.

ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటా

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రజలకు అన్ని సమయాలలో అందుబాటులో ఉంటూ ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి ప్రజా సమస్యలు తీర్చేందుకు తన వంతు కృషి చేస్తానని 34వ డివిజన్ ఇంచార్జ్ అలీ అక్బర్ అన్నారు. శుక్రవారం డివిజన్లో జరుగుతున్న సిసి డ్రైన్ పనులను పర్యవేక్షిస్తున్న ఆయన ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తన డివిజన్లోని కుమ్మరికుంట వీధిలో జరుగుతున్న సిసి డ్రైన్ పనులను నాణ్యతతో చేయిస్తున్నానన్నారు. డివిజన్లో ఏ ఒక్క చిన్న సమస్య నా దృష్టికి వచ్చినా వెంటనే మేయర్ సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌భాష, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేంత వరకు మా శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మళ్లీ ప్రజల ఆశీస్సులు కోరుతానని తెలిపారు.

వాలంటీర్లు బాధ్యతగా వ్యవహరించుకోవాలి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని స్థానిక సోమిరెడ్డిపల్లె సచివాలయం-1కు గ్రామ వాలంటీర్లు ఖాళీ అవ్వడంతో వాటిని భర్తి చేశారు. శుక్రవారం గ్రామ వాలంటీర్లుగా మండల పరిషత్ కార్యాలయం వద్ద రిజర్వేషన్లు కేటాయించిన ఆ పంచాయతీలో ముగ్గురిని నూతనంగా వాలంటీర్లకు నియామక పత్రాలను ఎంపీపీ వీరనారాయణ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందచేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అందచేయడంలో వాలంటీర్లది కీలకపాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామయ్య, ఆఫీస్ సూపరింటెంట్ రామాంజినేయులు, సీనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున, సచివాలయం కన్వీనర్ జోగయ్య, మన్యం శంకర్ రెడ్డి, నాగార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, కష్టపడే నైజంతోనే.. బంగారు భవిష్యత్తు..!

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి సందేశం

విశాలాంధ్ర బ్యూరో- కడప: ప్రతి ఒక్కరూ.. క్రమశిక్షణ, కష్టపడి నైజాన్ని అలవర్చుకుంటే.. బంగారు భవిష్యత్తు మీ సొంతమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి విద్యార్థులకు సందేశం ఇచ్చారు. శుక్రవారం ఉదయం భానుకోట క్షేత్రం ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మధ్యాహ్నం కడప జిల్లా ముద్దనూరులోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో ముద్దనూరు జిల్లా పరిషత్ స్కూల్లో ఆరు, ఏడవ తరగతి చదివానని, నేను చదివిన చిన్ననాటి స్కూలులో విద్యార్థులను కలుసుకోవడం, ఆ నాటి పరిస్థితులను గుర్తు చేసుకోవడం నిజంగా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి మూడు అంశాలను తప్పక గుర్తుంచుకోవాలని సూచించారు. ఉదయాన్నే ఐదు గంటలకు లేవాలని, ఆ సమయంలో మన మెదడు ప్రశాంతంగా ఉంటుందని.. మనం చదివే ప్రతి అంశం మనకు సులభంగా అర్థమవుతుందన్నారు. అలాగే విద్యార్థి దశ నుంచే నచ్చిన ఆటలు ఆడాలన్నారు. ప్రతిరోజు ఒక కొత్త ఇంగ్లీష్ పదంతో పాటు ఇంగ్లీష్ పేపర్‌ను కూడా తప్పక చదవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో కలిసి దావుస్ వెళ్ళిన సమయంలో బైజుస్ సీఈఓ తో మాట్లాడి బైజుస్ కంటెంట్‌తో ఉన్న లక్షలకు పైగా టాబ్లెట్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులందరికీ అందించడం జరిగిందన్నారు. అందుకు గాను ప్రభుత్వం రూ.600 కోట్లను ఖర్చుచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందజేసిన టాబ్లెట్ ద్వారా విద్యార్థులు సిలబస్‌లోని ప్రతి ఒక విషయాన్ని అర్థవంతంగా అధ్యయనం చేయాలన్నారు. త్వరలో ఎలక్ట్రానిక్ బోర్డ్‌లను కూడా ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేయనున్నామని తెలిపారు. పేద విద్యార్థులను అనే భేదం లేకుండా ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణ కష్టపడే మనస్తత్వం ఉంటే కచ్చితంగా భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుంటారన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం అందరికీ సక్రమంగా అందుతుందా, ట్యాబ్‌లు అందరికీ అందాయా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి మొదటిసారి ఈసారి జిల్లాకు విచ్చేసి ముద్దనూరు పాఠశాలకు రావడం అందులో నేను భాగస్వాములు కావడం ఆనందాన్నిచ్చిందన్నారు. కోవిడ్ విపత్కర సమయంలో సిఎస్ వద్ద పనిచేసి.. ఆయన నుండి ఎన్నో కొత్త విషయాలు, లీడర్ షిప్ క్వాలిటీస్ నేర్చుకోవడం జరిగిందన్నారు. మనం ఎక్కడి నుంచి వచ్చామనే రూట్ లెవెల్‌ను మర్చి పోకుండా ఆయన చదివిన చిన్ననాటి పాఠశాలలో మీ అందరితో మాట్లాడే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియం చేసుకొని అత్యున్నత స్థాయిలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాక్షించారు. అనంతరం ఆయనతో పాటు చదివిన పూర్వపు విద్యార్థులు, ముద్దనూరు జిల్లా పరిషత్తు స్కూల్ యాజమాన్యం ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం సాయంత్రం ఆయన రేణిగుంటకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు, సర్వ శిక్ష అభియాన్ పిఓ ప్రభాకర్ రెడ్డి, జడ్పిపి స్కూల్ హెంఎం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

మార్చి 30న అంకురార్పణ, 31న ధ్వజారోహణం : అధికారులతో జేఈవో వీరబ్రహ్మం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : కడప జిల్లా ఒంటి మిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గల తన చాంబర్లో గురువారం సాయంత్రం ఆయన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మం మాట్లాడుతూ శ్రీ కోదండరామ స్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీని ఎప్పుడు ప్రారంభించాలనే అంశంపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాలకు డిప్యూటేషన్ మీద నియమించే అధికారులు, ఉద్యోగులతో పాటు శ్రీవారి సేవకులకువసతి ఆహారం ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వామివారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించడానికి విరివిగా మజ్జిగ తాగునీరు పంపిణీ చేయడానికి అవసరమైన కౌంటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని భద్రత, పార్కింగ్ ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన చెప్పారు. ఆలయం, కల్యాణ వేదిక వద్ద భక్తులను ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, విద్యుత్ అలంకరణలు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుని పారిశుధ్యం ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అవసరమైన మందులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. బ్రహ్మోత్సవాల వాహన సేవల ముందు హిందూ ధర్మ ప్రచార పరిషత్ భజన బృందాలచే ఆకట్టుకునేలా ప్రదర్శనలు ఉండాలని, అలాగే కల్యాణోత్సవం రోజున చక్కటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవ నిర్వహణ ఎలా ఉండాలి, సిబ్బంది ఎంతమంది అవసరం అనే విషయాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. కాగా మార్చి 30వ తేదీ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. 31 వ తేదీ ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సమీక్షలో డిప్యూటీవోలు గుణ భూషణ్ రెడ్డి, గోవిందరాజన్, సుబ్రహ్మణ్యం, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, అన్నదానం ప్రత్యేక అధికారి జి ఎల్ ఎన్ శాస్త్రి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డి.ఎఫ్.ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఎఫ్ఎంఎస్ టోకన్ నెంబరు ఇచ్చారు..!

ఎఫ్‌డీఆర్ బిల్లులు మరిచారు- అధికారుల నిర్వాకం - కాంట్రాక్టర్లలో ఆందోళన

కోర్టు తలుపులు తట్టనున్న గుత్తేదారులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : దున్నపోతుపై వర్షం పడిన చందంలా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఉందనడానికి కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న అష్టకష్టాలే ప్రత్యక్షసాక్షాలు గతంలోఏ ప్రభుత్వ హయాంలోను పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు జంకిన సందర్భాలు లేవు. తొలిసారిగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరి వ్యవహారాలతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు జంకడమే కాకుండా వాటి ఊసు ఎత్తేందుకు కూడా సాహసించలేకపోతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్వహించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాని దయనీయ పరిస్థితి నెలకొంది. ఇలాంటి విమర్శలు ఎన్ని వస్తున్నప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. ఇందుకు ఉదాహరణగా ఎఫ్‌డీఆర్ పనులను తార్కాణంగా చెప్పవచ్చు. జిల్లాలో గత ఏడాది మార్చి మాసంలో పూర్తి చేసిన ఎఫ్‌డీఆర్ పనులకు సంబంధించిన బిల్లులకు ఇప్పటి వరకు మోక్షం లభించకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు ప్రైవేటు అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు. యుద్ద ప్రాతిపదికన ఎఫ్‌డీఆర్ ద్వారా గ్రావెల్, సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. ఎర్రగుంట్ల మండల పరిధిలోని హనుమనగుత్తి-ఎర్రగుడిపాడు గ్రామాల మధ్య రస్తా, పెద్దముడియం మండలంలోని భీమగుండం-బోదుపల్లె గ్రామాల మధ్య రస్తా పనులను రూ.40లక్షలతో సదరు కాంట్రాక్టర్లు పూర్తి చేసిన సంగతి విదితమే. సకాలంలో పనులను పూర్తి చేయించుకున్న అధికారులు అనంతరం ఒకరిపై ఒకరు బాధ్యతలను నెట్టుకుంటూ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడం వ్యవ హారంపై ఇదివరకే పత్రికల్లో కథనాలు వచ్చిన ప్పటికీ సదరు శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండిపోయాయి. తమ బిల్లల మంజూరు లో నెలకొన్న జాప్యంపై కాంట్రాక్టర్లు సంబందిత శాఖల అధికారులతో పాటు సాక్షాత్తు జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా స్పందన కార్యక్రమం ద్వారా తీసుకెళ్లడం జరిగింది. ఆ నేపథ్యంలో కాంట్రాక్టర్లకు సీఎఫ్ఎంఎస్ టోకన్ నెంబర్లు కేటాయిస్తూ చర్యలు తీసుకున్నారు. అయితే నగదు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు తమకు మంజూరు చేసిన టోకన్ నెంబర్లను చూసుకుంటూ ఆందోళన చెందుతున్నారు. ఓ కాంట్రాక్టర్‌కు 689181 నెంబరును సీఎఫ్ఎంఎస్ కింద కేటాయించారు. 7 మాసాలు గడుస్తున్నప్పటికీ నగదు విడుదల కాకపోవడం కొసమెరుపు. సదరు కాంట్రాక్టర్లు ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్ల వలె రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తే కానీ ఈ సమస్యకు పరిష్కారం దొరకదేమోనన్న మీమాంస నెలకొంది.

అంతర్ రాష్ట్ర నేరస్తుడి గుట్టురట్టు : ఎస్పీ

విశాలాంధ్ర-కడప క్రైం : ఆధార్ ఫింగర్ ప్రింట్స్‌తో కోట్ల రూపాయల్లో ప్రజలకు మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర నేరస్తుడి గుట్టురట్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం పోలీసు పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆధార్ కార్డు కు అనుసంధానంగా ఉన్న వేలి ముద్రలను క్లోనింగ్ చేసి ప్రజల బ్యాంక్ అకౌంట్‌ల నుంచి వారికి తెలియకుండా నగదు కాజేస్తున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా అరెస్టు చేశామన్నారు. అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తుడు ఆధార్ ఆధారిత సమాచార దుర్వినియోగం కేసులో గోరఖ్ పూర్, ఉత్తప్రదేశ్‌కు చెందిన శేషనాథ్ విశ్వకర్మ అలియాస్ శేష్‌నాథ్ శర్మ (27) అనే నిందితుడి అరెస్ట్. చేసినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో జిల్లాలోని కొంత మంది ప్రజలు తమ బ్యాంకు ఎకౌంట్ నుండి తెలియకుండా నగదు బదిలీ అవుతోందని ఫిర్యాదులు చేశారన్నారు. ఇదే విధంగా గత ఏడాది అక్టోబరు 28న కడప నగరం పక్కీర్ పల్లి గ్రామానికి చెందిన సనాపు రాజశేఖర్ రెడ్డి (69) చిన్నచౌక్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారన్నారు. గత ఏడాది జూన్ 21వ తేదీ నుండి 29వ తేదీ తన కెనరా బ్యాంక్ ఖాతా, యూనియన్ బ్యాంకు ఎకౌంట్ల నుండి తనకు తెలియకుండా రూ.89,550 లు విత్ డ్రా చేసినట్లు, తాను ఎవరికి ఓ.టి.పిలు గాని ఎటువంటి లింక్ లు గాని చెప్పలేదని ఫిర్యాదు చేశారన్నారు. అయినా కూడ తన ప్రమేయం లేకుండా తన బ్యాంకు ఖాతాల నుండి నగదు ను ఎవరో ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు ఫిర్యాదు చేసారన్నారు. ప్రత్యేక పోలీస్ టీమ్ నేడు మరో ఇద్దరు ముఠా సభ్యులను ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో అరెస్టు చేసి జిల్లాకు తీసుకు వస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలలో సుమారు 440 మంది యొక్క వేలి ముద్రలను తయారు చేసి బ్యాంకు ఖాతా లోని నగదు ను కొల్లగొట్టారన్నారు. బ్యాంకు కస్టమర్ సర్వీస్ పాయింట్ అనుమతి తీసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితులపై దేశావ్యాప్తంగా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ లో 308 ఫిర్యాదులు... 128ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయన్నారు. జిల్లాలో ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలందరూ తమ ఆధార్ కార్డుల బయోమెట్రిక్ లాక్ లేదా తగు

కడప-బెంగళూరు రైలు మార్గాన్ని వద్దని ఆక్షేపించడం దుర్మార్గం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: కడప-రాయచోటి-బెంగళూరు రైలు మార్గాన్ని వద్దని ముఖ్యమంత్రి జగన్ ఆక్షేపించడం దుర్మార్గమని కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు మార్గం వద్దనారంటే జగన్ అభివృద్ధి నిరోధకుడని చెప్పవచ్చన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008-09 రైల్వే బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం వాటా చొప్పున ఖర్చు భరించే షరతులతో 260కిలోమీటర్లు పొడవు రూ.3028కోట్ల అంచనా విలువ తో కడప-పెండ్లిమర్రి- లక్కిరెడ్డిపల్లె - రాయచోటి- మదపల్లె, బెంగ ళూరు వరకు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ మంజూరు చేశారన్నారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలు ఉన్నార న్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు రూ.350కోట్లు ఖర్చు చేసి 21.30కిలో మటర్లు పనిపూర్తిచేశారన్నారు. కొన్నాళ్లపాటు డెమో రైలు కూడా నడచిం దన్నారు. దురదృష్టవశాత్తూ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర వాటా నిధులు ఇవ్వని కారణంగా రైల్వేశాఖ పనులను నిలిపివేసిందన్నారు. ఇంతటితో ఆగక ఈ ప్రాజెక్టు వద్దు దీనికి బదులుగా ముద్దనూరు- పులివెందుల- ముదిగుబ్బ రైల్వేలైను మంజూరు చేయాలని జగన్ కేంద్రానికి లేఖ రాశారన్నారు. ఆ మేరకు ముఖ్యమంత్రి తరుపున ఎంపీ రైల్వేశాఖ మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారన్నారు. కొత్తగా రైల్వేలైన్ మంజూరు చేయమని విజ్ఞప్తిచేయడం మంచిదే అని, అయితే కానీ ఇప్పటికే మంజూరైన రైల్వేలైన్ వద్దని ఆక్షేపించడం గర్హనీయమన్నారు. తండ్రి మంజూరు చేయించిన రైల్వేలైన్‌ను తనయుడు వద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కడప-బెంగళూరు మార్గానికి అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం తరుపున చెల్లించి పనులను పునరుద్ధరించాలని కాంగ్రెస్‌పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి వెల్లడించారు.

సోమేశ్వరుడి సన్నిధిలో జవహర్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం రావులకొలను పంచాయతీ పరిధిలోని భానుకోటలో ప్రముఖ పుణ్యక్షేత్రం సోమేశ్వరాలయంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన జవహర్‌రెడ్డికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, ఓ ఎస్ డి అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వివేకా హత్య కేసులో నిజాలను సీబీఐ నిగ్గు తేల్చాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మాజీ మంత్రి వివేక్ హత్య కేసు ముందుగానే సిబిఐని నిగ్గు తేల్చాలని మేమే కోరామని వైయస్సార్ జిల్లా అధ్యక్షులు కే సురేష్ బాబు అన్నారు. శుక్రవారం కడప నగరంలోని వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు క్యాంప్ కార్యాలయం నందు పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ ముందు నుండి వివేక హత్య కేసుపై సీబీఐ దర్యాప్తు చేయాలని వైసీపీ డిమాండ్ చేసిందన్నారు. వాస్తవాలను తేల్చి నిజాలు బయటకు రావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కోరారన్నారు. త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని కోరుతున్నామన్నారు. హత్య జరిగిన సమయంలో అప్పటి ఇంటలిజెన్స్ డిజి ఏబీ వెంకటేశ్వరరావు కేసు తప్పుదోవ పట్టించారన్నారు. లోకేష్ చేస్తున్న పాదయాత్రలో జనాలు లేక పచ్చ మీడియా అనవసర వార్తలు రాస్తున్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లు బయటకు వస్తున్నారని అనడం శోచనీయమనన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను చంద్రబాబు కొనుగోలు చేసినా జగన్ బయపడలేదన్నారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, రామలక్ష్మణ రెడ్డి, కిరణ్, సుబ్బారెడ్డి,నాయక్, ఎల్లారెడ్డి, మాధవ రెడ్డి, మనోజ్ కుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

6న చలో కలెక్టరేట్: సీపీఐ

విశాలాంధ్ర- పోరుమామిళ్ల : బద్వేల్ నియోజక వర్గంలోని పోరుమా మిళ్ల పట్టణంలో ఎస్టీయూ భవనం నందు సిపిఐ బద్వేల్ ఏరియా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగినది. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్, బషీరునిసా హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ నవరత్నాల్లో భాగమైన జగనన్న కాలనీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరిగినది. ఈ కాలనీలో ఉన్న లబ్ధిదారులు నిజంగా వారి సొంత ఇంటి కల నెరవేరిందని కలలు కండం జరిగిందన్నారు. ఆ కలలు కలలుగానే మిగిలిపోయాయి తప్ప సొంత ఇంటి కల నెరవేరులేదని వారు అన్నారు. ప్రభుత్వం మాట తప్పని మడమ తిప్పని ప్రభుత్వముగా ఉండాలి అంటే జగనన్న కాలనీలో ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్క లబ్ధిదారునికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ ఉద్యమం తీవ్రతరం దాల్చిందని జరిగే ఎటువంటి పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి జకరయ్య, ఏరియా సహాయ కార్యదర్శిలు, పిడుగు మస్తాన్, చంద్రమోహన్ రాజు, కార్యవర్గ సభ్యులు బాల ఓబయ్య, సుబ్బారెడ్డి, కేశవ, పివి రమణ, ఫిరోజ్, ఇమ్మానియేలు, జివెల్ నరసింహ, సంజీవ్, జకొబ్, పెంచలయ్య, విజయమ్మ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర- వేంపల్లె: ముఖ్య మంత్రి జగన్ పాలనలో కార్పొరేట్ విద్యాసంస్థ లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయని వైసీపీ మండల కన్వీనరు కల్లూరు చంద్ర ఓబులరెడ్డి పేర్కొ న్నారు. వేంపల్లి మండలం జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో తలిశెట్టి సుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా తలిశెట్టి సుబ్రహ్మణ్యం, తల్లి శెట్టి శేషమ్మ జిల్లా పరిషత్ బాలుర 75 వ , బాలికల 53 వ, ఉన్నత పాఠశాలలో (డైమండ్ జూబ్లీ) వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కన్వీనరు చంద్ర ఓబుల్ రెడ్డి, ఎంపీపీ నల్లంగారి గాయత్రి, వేంపల్లి సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో పెదరికం పొవాలన్న, పెద పిల్లలు సామాజిక స్థితిగతులు మెరుగుపడాలన్న, విద్యతోనే సాధ్య పడుతున్నారు. ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి కార్పొరేట్ విద్యా సంస్థల ధీటుగా మనబడి నాడు - నేడు పథకం ద్వారా 15 కోట్లు ఖర్చు చేసి స్కూల్ రూపు రేఖలు మార్చి నిర్మించడం జరిగిందన్నారు. అకలి బాధలతో బడి మానేసే పరిస్థితులు రాకుడదనే సంకల్పంతో ఇప్పటికే అమ్మబడి, విద్యా దీవెన, వసతి దీవెన గోరు ముద్ద, జగనన్న విద్యా కానుక సంక్షేమ పథకాలు అమలు పరుస్త న్నారని చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులు బాగా చదువుకోని తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి ప్రభుత్వానికి మంచి పేరు ప్రతి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. మురుగు నీటి సమస్య కోసం సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు రూ. 20,000 లు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి అది రెడ్డి హెచ్‌ఎంలు, విజయకుమారి, వెంకట రమణయ్య స్కూల్ కమిటీ చైర్మన్ ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ ఎన్నిక

విశాలాంధ్ర - లింగాల : లింగాల మండలం అక్కులాగారిపల్లె గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా పోచంరెడ్డి లలితదేవి ఎన్నికైందని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శుక్రవారం ఈఓపిఆర్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో వార్డు మెంబర్లు లలితదేవిని ఎన్నుకున్నారు. ఇంతవరకు ఉపసర్పంచ్ పదవి కాలిగా ఉండటంతో శుక్రవారం అధికారులు ఎన్నిక నిర్వహించారు. ఇంతకుముందు పలుమార్లు ఎన్నిక కోరం లేక వాయిదా వేయడం గమనార్హం.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



కళాతపస్వి విశ్వనాథ్ మృతి సినీరంగానికి తీరనిలోటు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగు సినీ జగత్తులో మరుపురాని, మరువలేని ఆణిముత్యా ల్లాంటి చిత్రాలను అందించిన కళాతపస్వి, దాదాసాహెబ్ ఫాల్కె అవార్డు గ్రహీత కె.విశ్వనాథ్ మృతి సినీ ప్రపంచానికి, సినీ రంగానికి తీరని లోటు అని పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు సినీ ప్రపంచంలో అపురూప చిత్రాలైన శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, సిరిసిరి మువ్వలు, శ్రుతిలయలు, అపద్భాంధవుడు వంటి కళాత్మక చిత్రాలను అందించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారని అన్నారు. చిత్ర జగత్తులో దర్శక ధృవతార కె.విశ్వనాథ్ లేని లోటును ఎవరూ పూరించలేదని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానని జింకా సుబ్రమణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘర్షణ కేసులు మూడు నెలలు జైలు, జరిమాన

విశాలాంధ్ర-కొండాపురం: మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బీ.కొట్టాలపల్లె గ్రామానికి చెందిన సారెడ్డి మహేశ్వర్ రెడ్డి, సారెడ్డి తిరుపాల్ రెడ్డి, సారెడ్డి రాజేశ్వరిలు ఇంటి స్థల విశయంలో మనస్పర్ధల కారణంగా 25.07.2017తేదిన అదే గ్రామానికి చెందిన గుత్తి పుల్లారెడ్డి మరియు అతిని భార్యను కట్టెలు, రాళ్లతో కొట్టి రక్తగాయాలు చేసినందున బాధితుని ఫిర్యాదుమేరకు అప్పట్లో తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడమైనది, కేసు విచారణలో భాగంగా శుక్రవారం జమ్మలమడుగు కోర్టు వారు మొదటి ముద్దాయికి మూడు నెలల జైలుశిక్ష, రూ.11వేలు జరిమాన, రెండవ ముద్దాయికి రూ.11వేలు జరిమాన, మూడవ ముద్దాయికి రూ.5500 జరిమాన విధించడం జరిగింది. దీనిలో రూ.20వేలు బాధితునికి ఇవ్వవలసిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

పేదల పక్షాన సీపీఐ పోరాటం

ఇళ్ల లబ్ధిదారులందరూ 6న కలెక్టరేట్‌కు తరలిరండి: సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : పేదల సొంతింటి నిర్మాణంకు ఐదు లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ నగర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంకు హాజరైన చంద్ర మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు అమాంతంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత ధరల కనుగుణంగా జగనన్న ఇళ్లకు కనీసం 5 లక్ష రూపాయలు ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీలలో అసౌకర్యాల నడుమ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. త్రాగడానికి నీళ్ల అటుంచితే ఇంటి నిర్మాణానికి సైతం నీళ్లను కొనుక్కునే దుస్థితి నేటికి ఉండటం దారణమన్నారు. చంద్రబాబు హాయంలో కట్టిన టిడ్కో ఇళ్ళ ఫినిషింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెప్పకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదన్నారు. సొంతింటి దారుల సమస్యలను పరిష్కరించాలని పేదల పక్షాన సిపిఐ రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట చేపట్టిందన్నారు. ఫిబ్రవరి 6న కలెక్టరేట్ ముట్టడి, ఫిబ్రవరి 22న చలో విజయవాడ కార్యక్రమాల్లో లబ్ధిదా రులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఐ నగర సహయ కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, కేసీ బాదుల్ల, ద్రవిడ సురేష్, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు సావంత్ సుధాకర్, మల్లికార్జున, ఓబయ్య, శంకర్ నాయక్, చెంచయ్య, నాగరాజు, బ్రహ్మం, ఆర్.బాబు, మునెయ్య, భాగ్యలక్ష్మీ, దస్తగిరి,నాగిరెడ్డి, పకీరప్ప, భీమరాజు, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, దస్తగిరి, ఈశ్వరయ్య, నాగేంద్ర, ఏసురత్నం,గంజికుంట నాగరాజు, పుల్లయ్య, రాహుల్, మైనుద్దిన్ పాల్గొన్నారు.

సంగీత దర్శకుడికి ఘన నివాళులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్వర్గీయ ఎన్టీఆర్ నటించిన కొండవీటి సింహం, డ్రైవర్ రాముడు, జస్టిస్ చౌదరి ఇలా ఎన్నో ఎన్టీఆర్ నటించిన చిత్రానికి సంగీతం అందించిన దర్శకుడు కె.చక్రవర్తికి శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న టిడిపి బిసి సెల్ ఆఫీసులో చక్రవర్తి పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు మైనార్టీ నాయకులు ఉస్మాన్ ఖాన్ తెలుగు యువత అధికార ప్రతినిధి రెహమాన్ టిడిపి జిల్లా బీసీ ఉపాధ్యక్షులు దస్తగిరి రాయల్ కరిముల్లా పాల్గొన్నారు.

గడువులోపు పూర్తిచేయాలి

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పులివెందుల పట్టణ పరిధిలోని నిర్మాణదశలో ఉన్న జగనన్నకాలన నిర్మాణాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఈ అంశంపై వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణాలు పటిష్టంగా, నాణ్యతగా ఉండేందుకు చొరవ చూపాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, సచివాలయ అమేనిటి సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలోని సభాభవనంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సానేపల్లి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఎంపీపీ మూలె లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులందరు తమ నివేదికలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

నీలి సోదరుడు అస్తమయం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు సోదరుడు నీలి కోదండ శ్రీనివాసులు శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్య కారణంగా కడప రిమ్స్ హాస్పిటల్ లో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. నీలి కోదండ శ్రీనివాసులు ఆర్టీసీలో డ్రైవర్గా పదవీ విరమణ పొంది ఉన్నారు. శుక్రవారం ఉదయం రామకృష్ణ హై స్కూల్ వద్ద గల హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహింపబడతాయని అన్నారు. తన సహోదరుడు 62 సంవత్సరాలకే పరమపదించడం తనకు చాలా బాధగా ఉందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నీలి శ్రీనివాసరావు కోరారు.

కుస్టు నివారణపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కుస్టు నివారణ అంశంపై ఏపీఎంఓ సుబ్బారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుస్టువ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే వైద్య చికిత్స ద్వారా సులువుగా నయమవుతుందన్నారు. స్పర్శలేని మచ్చలను కుస్టు లక్షణాలుగా గుర్తిస్తామన్నారు. సకాలంలో సరైన వైద్యం పొందితే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో: తొండూరు మండలం మదూరు గ్రామంలో శుక్రవారం కుస్టువ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుస్టు నివారణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వైద్యసిబ్బంది విశదీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు కమలకుమారి, సంతకొవ్వూరు ఆరోగ్య సిబ్బంది, సుబ్రమణ్యం, సంపత్ పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారిగా గునిశెట్టి సాయి కుమార్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారిగా కడప నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం మామిళ్ళ పల్లె, సియం ఆర్ పల్లె కు చెందిన గునిశెట్టి సాయి కుమార్ ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ఆదేశాల మేరకు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి కమిటీలు వేసి చేనేత కార్మికుల సమస్యలపై స్పందించి చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా పోరాటం చేయాలని వాటి నివేదికలు రాష్ట్ర, కేంద్ర శాఖలకు పంపాలని చెప్పారు. అంతే కాకుండా రాష్ట్ర కమిటీ సూచనల మేరకు నడుచుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారిగా నియమితులైన గునిశెట్టి సాయి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సలహాలు,సూచనలు మేరకు చేనేత కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తానని అన్నారు తన మీద పెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్స కుంబాభిషేకాలు ప్రారంభం

విశాలాంధ్ర వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని పైడికాల్వ గ్రామ సమీపంలో కొలువైన శ్రీ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవ కలశకుమాభిషేకం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరి నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి వేద పండితులచే గణపతి పూజ, అష్టోత్తర కలశ స్థాపన గోపూజ స్థల దేవత ప్రార్థన,పల సమర్పణ యాగ, మండప ప్రవేశము, మహా సంకల్పము పుణ్యహావాచనము దేవానంది మధ్యక పూజ, అంకురార్పణము,ధ్వజరోహణము, ధ్వజబలి,ప్రాయశ్చిత్త శైవ అస్త్ర వైష్ణవ అస్త్ర అభ్యాక్షరి ద్వాదశ పూజలు ,మండప సంస్కరణము తోరణధ్వజ ద్వారా దేవత కలశస్థాపనం,మండప దేవత, అవహనము,బలి,కుంబేష కారకాది పూజలు.అగ్ని జననము, పంచాగ్ని విధానముతో అఘోర రుద్ర సుదర్శన పారాణాయములు.లలిత, లక్ష్మి, విష్ణు సహస్రనామ పారాయణములు,అనంత విజయ గణపతి హెూమము, రుద్ర ఏకాదశి, శత రుద్ర సహితి హెూమము పూర్ణ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

రీసర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారం: సర్పంచ్

విశాలాంధ్ర - చెన్నూరు : రైతుల కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేసే భూ సర్వేలతో వారి భూ సమస్యలు తీరుతాయని ఉప్పరపల్లె సర్పంచ్ శ్రీలక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎర్ర సాని మోహన్ రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పరపల్లి గ్రామంలోని దుగ్గనపల్లి పొలంలో రీ సర్వేల కోసం ప్రజాప్రతినిధులతో డ్రోన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగ్గనపల్లి గ్రామ పొలంలో 14 57. 79 ఎకరాల భూమి ఉన్నదని, ఆ భూములను డ్రోన్ ద్వారా చిత్రీకరించడం జరుగుతుందన్నారు. రైతులు రీ సర్వేకి సహకరించాలని, ప్రతి రైతుకు వారి వారి హద్దులు ఏర్పడి వారికున్న భూ సమస్యలు తీరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నిరంజన్ రెడ్డి, నాయకులు త్రిలోక్ నాథ్ రెడ్డి, సర్వేయర్ సోమశేఖర్, పైలట్ పవన్ కుమార్, జూనియర్ సర్వేయర్ వెంకట శివారెడ్డి, వీఆర్వో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సాగు పంటలపై అవగాహన

విశాలాంధ్ర-కాశినాయన : కడప జిల్లా కాశి నాయన మండలంలోని సావిశెట్టిపల్లె రైతు భరోసా కేంద్రం లోఏ.డి.ఏ. మురలీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎం.ఎ. ఓ. మహేష్ మాట్లాడుతూ రైతులకు డ్రిప్ రిజిస్ట్రేషన్, కంపెనీ ఎలా మార్చుకోవాలి మరియు 90%,70%సబ్సిడీపై క్షుణ్ణంగా వివరించారు. అలాగే డ్రి ప్ పరికరముల ఆమ్ల చికిత్స ఎరువుల వాడకం గురించి వివరించారు..అదేవిధంగా సర్పంచ్ ఈ కార్యక్రమంలో సగిలి వరప్రసాద్ మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శశికళ, డ్రిప్ కంపెనీ ఉద్యోగులు, మాజీ సర్పంచ్ రఘురాంరెడ్డి, రైతులు సుబ్బారెడ్డి, భాష,రామయ్య,కలువ వెంకట శేషయ్య, సగిలి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వాస్క్యులర్ చికిత్స వైద్యశిబిరం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : స్థానిక కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో హైదరాబాద్ ఆసియన్ వాస్క్యులర్ హాస్పిటల్ వారిచే ఉచిత వాస్క్యులర్ చికిత్స వైద్యశిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మహబూబ్‌ఆలీ తెలిపారు. పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన వాస్క్యులర్ వైద్యసేవలు నేడు మన కడప నగరంలో ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, శాలిపురు లాంటి నరాలు, కాలు లేదా పాదం వాపు, సిరిపుండ్లు, కళ్లలో రక్తసరఫరా లేకపోవడం లాంటి సమస్యలతో బాధపడుతుంటే వారు వెంటనే ఈ వైద్యశిబిరంలో వాస్క్యులర్ సర్జన్ సేవలు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు రూ.4500లు విలువ గల వైద్యపరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

గండి ప్రధాన అర్చకులు కన్నయ్య కన్నుమూత

విశాలాంధ్ర-వేంపల్లె: పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం మారెళ్లమడక పంచాయతీ పరిధి లోని గండిక్షేత్రం ప్రధాన అర్చకులు కన్నయ్య గురువారం రాత్రి కన్నుమూశారు. కన్నయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో ప్రస్తుత ఆలయ ప్రధాన అర్చకులుగా వర్తి కేసరి, వర్తి రాజా స్వాములు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ గత దశాబ్దల కాలంగా శ్రీ గండి వీరాంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చక స్వాములుగా రాష్ట్రవ్యాప్తంగానే కాక కర్ణాటక, తెలంగాణ వాసులకు ఆయన సుపరిచితులు అన్నారు. మౌనమునిగా ఉంటూ అందరినీ ఎప్పుడూ నవ్వుతూ పలకరిస్తూ ఆశీర్వదించేవారన్నారు.. శ్రీ గండి వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన కుమారులు వర్తి రాజా, కేసరి లను కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, గండి ఆలయ చైర్మన్ రాఘవేంద్రరావు ,ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుంద రెడ్డిలు వారి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్యయ్య కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

కర్ణాటక సీఎంను కలిసిన చవలముడి శంకర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు విన్న కర్ణాటక ముఖ్యమంత్రి వెంటనే ఆమోదించి తగ్గిన వైద్య సేవలు కల్పించాలని ఆరోగ్య శాఖ మంత్రి కె. సుధాకర్‌కి తెలియజేశారు. ప్రత్యేక చొరవ తీసుకొని నందమూరి తారకరత్నకి వారి కుంటుబ సభ్యులకు ఇన్ని సేవలు అందిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మైని మర్యాద పూర్వకంగా కలిసి నందమూరి అభిమానుల తరపున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. తదనంతరం కెనారాయణ హృదలయ హాస్పిటల్ లో ఉన్న నందమూరి తారకరత్నని కడప శంకర్ పరామర్శించారు. నిరంతరం నారాయణ హృదలయ హాస్పిటల్ లో ఉండి వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నా ఆరోగ్య శాఖ మంత్రి సుధాకర్‌కి నందమూరి అభిమానుల, తరుపున తెలుగు రాష్ట్ర ప్రజల తరపున కడప శంకర్ ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. నందమూరి తారకరత్నకి విశేషామైన వైద్య సేవలు ప్రత్యేక మైన డాక్టర్ల తో అందిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై ఆరోగ్య శాఖ మంత్రి కె. సుధాకర్ అటు నందమూరి అభిమానుల్లో ఇటు తెలుగు రాష్ట్ర ప్రజల్లో, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలలో చిరస్థాయిగా నిలుస్తారు మిమ్మల్ని గుర్తించుంటారు అన్ని కర్ణాటక ముఖ్యమంత్రికి శంకర్ తెలియజేసారు.

ప్రజా, భూ సమస్యలను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలోని గ్రామాలలో ప్రజా, భూ సమస్యలను పరిష్కరించేవిధంగా తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కిషోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల వారీగా వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిశీలించి ప్రజలకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తానని అన్నారు. భూ రికార్డు ను పరిశీలన చేయాలని, భూ యజమాన్యం ఎంజాయ్‌మెంట్లో తన అనుభవంతో ఉన్న వారికి అలిగేషన్ భూములపైన సర్వేయర్లు, వీఆర్వోలు దృష్టి పెట్టాలని అన్నారు. వీఆర్వోలు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని, స్పందన కార్యక్రమంలో ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వీఆర్ఓలు, సర్వేయర్లు, గ్రామ సహాయకులు తహసీల్దార్‌కు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ప్రతాప్‌రావు, వెలుగుఏపీఎం ప్రకాష్‌రావు, ఉపాధి ఏపీఓ వసంతకుమార్, వివిధ పంచాయతీల కార్యదర్శులు, తోట్లపల్లి సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మిదేవి, గొడ్లవీటి సర్పంచ్ బసిరెడ్డి చెన్నకృష్ణారెడ్డితో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ సోదరులకు అండగా ఉంటాం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ సోదరులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళగిరిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ ఆఫీసులో నిర్వహించిన ముస్లిం మైనార్టీ సోదరుల సమావేశంలో పాల్గొన్న కడప తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వీఎస్ అమీర్ బాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు ధైర్యంగా ఉండాలని ముస్లిం మైనారిటీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు అన్యాయం జరిగిందని గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు ముస్లిం మైనారిటీ సోదరులకు అందించిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క మైనార్టీ సోదరులకు అండగా నిలబడుతుందని తెలిపారు.

జవహర్‌రెడ్డి దృష్టికి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్య

విశాలాంధ్ర-పులివెందుల: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి దృష్టికి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యను తీసుకెళ్లారు. ఆ మేరకు సింహాద్రిపురం మండలం చవ్వారిపల్లె గ్రామంలో శుక్రవారం ఏపి డియస్సి కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించా రు. ఈ సందర్భంగా జెఏసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, వైయస్సార్ జిల్లా కన్వీనర్ బుక్కె గోపాల్ నాయక్‌లు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరామన్నారు. తమ విన్నపం ఫలిస్తుందని వారు ఆశాభావం వ్యక్తంచేశారు.

ఐఎఎల్ కేలండరు ఆవిష్కరణ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో శుక్రవారం పులివెందుల బార్ అసో సియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఐఎఎల్ కేలండరును న్యాయవాది ఓబులరెడ్డి ఆవిష్కరించారు. అడ్వకేట్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్కరికి సత్వర న్యాయం జరగాలన్నారు. అలాగే డబ్బు ఉన్న వారికి ఒకలాగా డబ్బు లేని మధ్యతరగతి వారికి మరొకలాగా ఉండ కూడదన్నారు. అందుకే కోర్టుకు వచ్చిన వారికి న్యాయం జరుగుతుంది గనుకనే ప్రతి ఒక సామాన్యుడికి న్యాయ వ్యవస్థ అంటే అంత నమ్మకం ఉందన్నారు. ప్రతి ఒక్క పేదవానికి న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరుణాకర్ రెడ్డి, ప్రకాష్, నాగ ప్రవీణ్ కిషోర్ కుమార్, వెంకట్ రాములు. మురళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర-కాశినాయన: ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణాన్ని పరిరక్షించు కోవచ్చునని సావిత్రీబాయి పూలే అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి పేర్కొన్నారు. కాశినాయన మండలంలోని రెడ్డి కొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాదా పీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిమళ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు.ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించి వాటిని నిర్లక్ష్యంగా పారవేయడం వలన అవి డ్రైనేజీ కాలువలలో చేరి మురుగు నీటి పారుదలను నిలిపివేస్తాయన్నారు. ప్లాస్టిక్ కవర్లు చెరువులో చేరితే వాటిని తిన్న చేపలు ఇతర ప్రాణులు చనిపోతా యన్నారు.2050 నాటికి సముద్రాలలో చేపల కన్నా ప్లాస్టిక్ కవర్లు అధికంగాఉంటాయన్న మేధావుల సూచనలు పాటించి ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానుకోవాలన్నారు.ప్లాస్టిక్ కవర్లకు బదులు వస్త్రసంచులు,జ్యూట్ సంచులు ఉపయోగించాల న్నారు.

అందుబాటులోకి రెడ్ బకెట్ బిర్యానీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: అందరికీ అందుబాటులో ఉండే విధంగా రెడ్ బకెట్ బిర్యాని ఉందని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుర్గాయపల్లి మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి లు అన్నారు. శుక్రవారం కడప నగరంలోని సాయిబాబా థియేటర్ ఎదురుగా రెడ్ బకెట్ బిర్యానీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి రుచికరమైన వంటకాలతో కార్పొరేట్ నగరాలలో ఉండే విధంగా రెడ్ బకెట్ బిర్యానీ కడపలో అధినేత ప్రవీణ్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు అనంతరం ప్రొప్రైటర్ కసిరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో 70 బ్రాంచీలు కలవు కడుపులో 70వ బ్రాంచ్ ప్రారంభించమన్నారు మా రెడ్ బకెట్ బిర్యానీ కి కావలసిన సొంతంగా తయారు చేసిన మసాలాలు నాణ్యమైన బియ్యము తో తయారు చేసిన రుచికరమైన రెడ్ బకెట్ బిర్యాని అని తెలిపారు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా మా రెడ్ బకెట్ బిర్యాని మాత్రమే పార్సెల్ మాత్రమే కలదు అన్నారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాక సురేష్ కార్పోరేటర్లు సానపు రెడ్డి శివకొండ రెడ్డి షఫీ వైసిపి నాయకులు మనోజ్ కుమార్ గాయత్రి కాలేజ్ ఇన్చార్జి నరి రెడ్డి పురుషోత్తం రెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్.గీత, థామస్ రెడ్డి చిత్తా దంపతులు బి.కోడూరు మండలంలోని ఆదిత్య రామ్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు 187 మందికి దుస్తులు పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు ఎల్. ప్రసాద్ రెడ్డి జి. శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ ఎఫ్ సి ఎన్ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వాటిలో భాగంగానే ఈ దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగపరుచుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహ రెడ్డి,నాగరాజును గెలిపించండి

విశాలాంధ్ర-గాలివీడు: రాబోయే ఎం ఎల్ సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ అభ్యర్థిగా శ్రీ కత్తి నరసింహా రెడ్డి గారినీ,పట్టభద్రుల అభ్యర్థిగా పోతురాజు నాగరాజును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ కోరారు.గాలివీడు మండలకేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలసి అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్త శుద్ధితో ప్రజల కోసమే పాటుపడుతున్న ఇలాంటి అభ్యర్ధులను చట్ట సభలోకి పంపించడం వల్ల ఉపాధ్యాయ,నిరుద్యోగ వర్గాలకు ప్రయోజనం ఉంటుందన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వస్తున్నారని , కానీ కత్తి నరసింహారెడ్డి ఉపాధ్యాయ సమస్యల కోసం తన సర్వస్వం వదులుకొని నిరంతరం వారి అభ్యున్నతికి పాటు పడుతున్నారన్నారు. అదేవిధంగా డాక్టర్ పోతు రాజు నాగరాజు కూడా తన ఉపాధ్యాయ వృత్తికే రాజీనామా చేసి ఉద్యమ జీవితానికే అంకితం అయ్యా డని, అలాంటి వారిని గెలిపించడం ద్వారా నిరుద్యోగుల తరపున గళం విప్పి ప్రభుత్వాలను నిలదీసి ఆంధ్ర రాష్ట్ర నిరుద్యోగులకు ఆశాకిరణంగా ఉంటారన్నారు . కావున ఉపాధ్యాయులు ,పట్టభద్రులు ఆలోచించి తమ అమూల్య మైన మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్, కృష్ణమూర్తి, పట్టభద్రులు పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

జగనన్న లేఔట్లలో మౌలిక వసతులు కల్పించాలి :కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: నవరత్నాలు పేదలం దరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరిష పిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు, ఎస్ డబ్ల్యు పిసి షెడ్స్ నిర్మాణాలు, తదితర అంశాలపై తహసిల్దార్ లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రోజురోజుకు పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఒక్కో లబ్ధిదారునికి రూ.35 వేలు రుణం ఇప్పించాలన్నారు. ఇందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సంబంధిత అధికారులతో మాట్లాడి లబ్ధిదారులకు తప్పకుండా 30 వేల రుణం ఇప్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని లేఅవుట్ వారీగా ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకోని పనిచేయాలన్నారు. హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. కొన్ని మండలాలలో అనుకున్న స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరగడంలేదని, వచ్చే వారం నాటికి ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఇల్ల నిర్మాణాల ప్రగతి సాధనలో నిర్లక్ష్యం చేయడం, లక్ష్యంలో వెనుకబడిన అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్మిస్తున్న ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాకు మొత్తం 501ఎస్ డబ్ల్యు పి సి షెడ్లు మంజూరయ్యాయని ఇందులో62 షెడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇవన్నీ వచ్చే వారం నాటికి పిల్లర్ లెవల్ కు తీసుకురావాలన్నారు. ప్రతి ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డు కు రోడ్డు కనెక్టివిటీ, నీటి సౌకర్యం, కల్పించి ప్రతి షెడ్డు కు తప్పకుండా నేమ్ బోర్డు రాయించాలన్నారు. ఎంపీడిఓలు వారానికి నాలుగుసార్లు ఎస్ డ బ్ల్యూ పిసి షెడ్లను విజిట్ చేసి పూర్తి కాని సెడ్ల నిర్మాణాలలో రోజురోజుకు పురోగతి కనిపించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ధనలక్ష్మి, హౌసింగ్ పీడీ శివయ్య, పంచాయతీరాజ్ ఎస్ఈ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడ్డ 11మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర - మదనపల్లి: తల్లి, బిడ్డను చంపడానికి యత్నించి బెదిరింపులకు పాల్పడ్డ 11 మందిపై మదనపల్లి రూరల్ పోలీసులు శుక్రవారం కేసునమోదు చేశారు. ఇందుకు సంబంధించి మదనపల్లి రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు.. మదనపల్లి మండలం, కొత్తపల్లి పంచాయతీ, కొత్తఇండ్లకు చెందిన ఎం.బాలప్రసాద్ నాయుడు తన భార్య సుధారాణితో పాటు కొడుకు బాలాజీని పట్టించు కోకుండా వదిలేశాడు. గత కొన్నేళ్లుగా మరో యువతితో ఇంట్లోనే సహ జీవనం సాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సుధా రాణి తన భర్త అక్రమ సంబంధాన్ని నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆగ్రహించిన బాలచంద్ర ప్రసాద్ తన బంధువుల సాయంతో భార్య కుమారుడిని హతమార్చి చంపడానికి ప్రయత్నం చేశాడు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు బాలచంద్ర ప్రసాదు తో పాటు మరో 10మందిపై కేసు నమోదయింది. త్వరలోనే నిందితులను అరెస్టు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లోకేష్‌ను కలిసిన మైనార్టీ యువకులు

విశాలాంధ్ర-పీలేరు : అరెస్ట్ చేసిన మైనారిటీ యువ కులను లోకేష్ పాదయాత్ర లో పీలేరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి నల్లారి కిషోర్ రెడ్డి కలిపించారు. పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలంలో అక్రమంగా అరెస్ట్ చేసిన మైనారిటీ యువకులను 8 మంది యువకులు సబ్ జైలు నుంచి విడుదల అయ్యారు. విడుదల అయిన మైనారిటీ నాయకులను నల్లారి కిషోర్ తమ వెంట తీసుకొని వెళ్లి పుతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం వద్ద పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ వద్దకు తీసుకొని వెళ్లారు. నారా లోకేష్ వారితో మాటలాడుతు తెలుగు దేశం పార్టీ మీకు అండగా ఉంటుంది అని ధైర్యం చెప్పారుఈ కార్యక్రమం లో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, చల్లా రామచంద్ర రెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హనీఫ్, వాల్మీకిపురం సయ్యద్ బాషా, మున్వర్,రెడ్డెప్పరెడ్డి, జనార్ధన్ గౌడ్,నిజాం,కౌషిక్ రెడ్డి,అవినాష్ రెడ్డి,ముబారక్, జావీద్, సుబహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-చిట్వేలి : మండలంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్నమయ్య జిల్లా వైద్య ఆ రోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య చిట్వేల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా రికార్డులు రిపోర్ట్‌లు తనిఖీ చేయడం జరిగింది. ఆలాగే సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. అలాగే ఆసుపత్రిలో డెలివరీలు పెంచాలనీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. తరువాత నూతనంగా నిర్మిస్తున్న హాస్పిటల్ భవనాన్ని పరిశీలించడం జరిగింది. అక్కడ స్థితి గతులను ఆడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. అన్సారీ డాక్టర్ సల్మా, ఆరోగ్య అధికారి విజయ్, సిహెచ్ఓ నీరజ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సంబేపల్లి మండలం నారాయణ రెడ్డి పల్లి గ్రామ పంచాయితీ ఉపసర్పంచిగా పొన్నెల సుదర్శన్ రెడ్డి ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఈవో పి ఆర్ డి రవీంద్రనాథ్ తెలిపారు. గతంలో ఉప సర్పంచ్ ఎన్నిక కొన్ని అనివార్య కారణాలవల్ల రద్దయినట్లు తెలిపారు. నేడు సమావేశం నిర్వహించి వార్డు సభ్యుల ఆమోదం మేరకు ఏకగ్రీవంగా ఎనిమిదవ వార్డు మెంబర్ సుదర్శన్ రెడ్డిని ఉప సర్పంచ్ గా ఎన్నుకున్నట్లు తెలిపారు. పంచాయతీ సర్పంచ్ పూజల అలివేలమ్మ రవీంద్రనాథ్ నియామక పత్రాన్ని అందజేశారు.

వివాహ వేడుకల్లో యర్రపురెడ్డి అజయ్ రెడ్డి

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె యర్రపరెడ్డి విజయభాస్కర్ రెడ్డి మమతా దంపతుల ఆహ్వానం మేరకు చిత్తూరులోని ఆర్ఆర్ కళ్యాణ మండపంలో యర్రపురెడ్డి సాయిదీప్ రెడ్డి, ప్రణీష నూతన వధూవరులను నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి జయమ్మ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అజంతారాణి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి, హరిత ఉపేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్వనాథ నాయక్‌తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

11నుండి బస్ని కొండ దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలు

విశాలాంధ్ర-మదనపల్లి: పట్టణంలోని బాబా అబ్దుల్ హుసేని వారి ఉరుసు ఉత్స వాలు ఘనంగా నిర్వహిస్తు న్నామని దర్గా పీఠాధిపతులు నూర్ బాబా శుక్రవారం దర్గా దగ్గర పోస్టల్ ను ఆవి ష్కరించార. గ్రంథము ఈనెల 11వ తేదీ ఉరుసు ఉత్సవాలు 12వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉరుసు ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ భాష హాజరవుతారు అన్నారు. వివిధ ప్రాంతాలలో ఉన్న దర్గా భక్తులు ఉరుసు ఉత్సవాలలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉపాధి హామీకి భారీ కోత
7న కేంద్ర కార్యాలయాల ఎదుట నిరసనలు

విశాలాంధ్ర-మదనపల్లి: ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రూ.29వేల 400 కోట్లు కోతపెట్టడాన్ని నిరసి స్తూ ఈనెల 7వ తేదీ మంగళ వారం అన్నమయ్య జిల్లా అంతటా కేంద్ర కార్యా లయాల ఎదుట ఆందోళనలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప శుక్రవారం నేడు స్థానిక ఎస్టియు కార్యాలయంలో ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీపై నిర్లక్ష్యానికి నిరసనగా బీఎస్ఎన్ఎల్, తపాలా, ఆకాశ వాణి కార్యాలయాల ముందు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంతోపాటు ఆహార భద్రతకు లోటు ఏర్పడేలా నిధులు తగ్గించడం, పేదలకు ఉపయోగపడే సబ్సిడీలన్నింటిపై 30శాతం కోత పెట్టడం ద్వారా పేదలను కేంద్ర ప్రభుత్వం మోసగించిందని విమర్శిం చారు. ఉపాధి హామీ చట్టానికి రూ.2.40 లక్షల కోట్లు కేటాయించాల్సిందేనని, ఆహార భద్రత కల్పించాలని, సబ్సిడీల లో కోతలు, అధిక ధరల అదుపునకు డిమాండ్ చేస్తూ జరిగే ఆందోళనల్లో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కే అనసూయ, శోభ, నిర్మల, మునిస్వామి, నవీన్, గౌరమ్మలు పాల్గొన్నారు.

జీఎన్ఎస్ఎస్‌కు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలపడం సరికాదు

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట, రైల్వే కోడూరు నియో జక వర్గాలలో ఎటువంటి సాగు నీటి ప్రాజెక్టులు లేకపోవడం దురదృష్టకరం అని ఈ ప్రాంతాలు పూర్తిగా సాగు మరియు త్రాగు కు వర్షపు నీటి మీద ఆధార పడవలసినటువంటి పరిస్థితి ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు మలిశెట్టి జతిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి అయితే ఈ రాజంపేట మరియు రైల్వే కోడూరు ప్రాంతాలలో కరువు సమయంలో త్రాగు మరియు సాగునీటి కి ఇబ్బంది ఉండదు అని ప్రజలు మరియు రైతులు భావిస్తున్నప్పటికీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం కూడా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పై శ్రద్ధ చూపనటువంటి బాధాకరమైన పరిస్థితి నెలకొందన్నారు. అదే సమయంలో గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు నీరు కేటాయించే విషయంలో ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలపడం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రభుత్వాలు ఆలోచించి చొరవ తీసుకొని వెంటనే ఈ గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తి చేసి కరువు సమయంలో చెరువులు నింపితే ఇక్కడి రైతులకు మరియు ప్రజలకు సాగు మరియు త్రాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.

స్పర్శ లేని మచ్చలు కుష్టు కావచ్చు

విశాలాంధ్ర-పీలేరు : కుష్టు వ్యాధి చర్మానికి నరాలకు సోకే అతి సామాన్యమైన వ్యాధి అని కొండయ్య హెల్త్ ఎడ్యుకేట ర్ అన్నారు. శుక్రవారం పి.హెచ్.సి. తలుపుల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు గూడరేవులపల్లి జెడ్.పి హై స్కూల్ విద్యార్థులకు కుష్టు వ్యాధి - నివారణ చర్యలు అంశంపై అవగాహన కార్యక్రమాలు మరియు విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య వివరిస్తూ కుష్టు వ్యాధి ప్రారంభ దశలో స్పర్శ లేని మచ్చల రూపములో ఉన్న కుష్టును గుర్తించే నైపుణ్యత అవసరమని, మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా ఎరుపు/ రాగి రంగు కలిగి ఉంటాయని, మచ్చలపై నొప్పి స్పర్శ వెంట్రుకలు అసలు ఉండవనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని కొండయ్య విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు పాజియబేగం, పీ.హెచ్.ఎన్. వెంకటసుబ్బమ్మ , ఏ.ఎన్.ఎం. షేమున్నీసా, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-గాలివీడు : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే శుక్రవారం హెచ్ ఈ ఓ సత్యనారాయణ, డిపిఎంఓ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ర్యాలీ అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారులు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై అందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. సకాలంలో వ్యాధికి చికిత్స పొందకపోతే అంగవైకల్యానికి దారితీస్తుందని అన్నారు. కుష్ఠు వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స ఉచితంగా లభిస్తోందని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సత్యనారాయణ, డిపిఎంఓ కృష్ణా రెడ్డి, హెడ్ మిస్సెస్ నిర్మల, సిహెచ్ఓ సుబ్బలక్ష్మీ దేవి, పిహెచ్ఎన్ షమీమ్ తార, హెల్త్ సూపర్ వైజర్ కె.మహేశ్వర రెడ్డి, జ్యోతి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర-రామాపురం : మండలం ఏకిలపల్లి గ్రామ పరిధిలోని ఎస్టి కాలనీ సమీపంలోని కబ్జాకు గురైన దళితుల స్మశాన వాటికను శుక్రవారం సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాల్ల శ్రీనివాసులు, మండల కార్యదర్శి వై చంద్రాయుడు,సహాయ కార్యదర్శి పోలూరు అశోక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత గిరిజనులు దాదాపు 60 సంవత్సరాల నుండి ఊరి పక్కన ఉన్న ఎస్సీ స్మశాన వాటికలో తమ కుటుంబాలకు చెందిన పెద్దలు చనిపోయినప్పుడు అక్కడే సమాధులు వేసుకుంటూ ఉండేవారు. అప్పటినుండి దాదాపు 25 కుటుంబాలకు చెందిన ఎస్సీ ఎస్టీలు నివసించేవారు. కానీ ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక కొంతమంది పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లారు అయితే వారు అక్కడ ఉన్నప్పటికీ తమ కుటుంబీకులు ఎవరైనా చనిపోయిన ఈ స్మశాన వాటికలోనే పూడ్చుకునేవారు కానీ ఉన్నట్లుండి అధికార పార్టీకి చెందిన నాయకులు స్మశాన వాటిక స్థలముతో పాటు చుట్టూ ఉన్న ఎస్సీల ఇళ్ల స్థలాలను సైతం చదును చేసి తమ పేరుతో పట్టా ఉందంటూ దౌర్జన్యం చేస్తూ పూర్తి స్మశాన వాటికను కబ్జా చేస్తున్న నియంత్రించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ భూములను అంగట్లో సరుకులు లాగా రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులకు ఎక్కడ పడితే అక్కడ పట్టాలు మంజూరు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని కబ్జాకు గురైన ఎస్సీ స్మశాన వాటికను కాపాడాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళితులు. సురేంద్ర రెడ్డి ,కృష్ణ, రవి చంద్రకళ, అంజనమ్మ, లక్ష్మీదేవి, నారాయణ పాల్గొన్నారు.

ఆత్మహత్యకి యత్నించిన యువతి మృతి

విశాలాంధ్ర - మదనపల్లి : కుటుంబ కలహాలతో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి శుక్రవారం మృతి చెందింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాలు.. కురబలకోట మండలం, మచిలీవారి పల్లి పంచాయతీ గొడ్డిండ్లవారిపల్లికి చెందిన దంపతులు మోహన, లక్ష్మీదేవిల కుమార్తె కౌసల్య18 అదే ప్రాంతానికి చెందిన ఓ యువకులతో చనువుగా ఉంటుందని తల్లిదండ్రులు గురువారం మందలించి వ్యవసాయ పనులకు బావి దగ్గరకు వెళ్లారు. రాత్రి చీకటి పడ్డాక తిరిగి ఇంటికి వచ్చిన కుటుంబీకులు కుమార్తె అప్పటికే పురుగు మందు తాగి కోమల ఉండడం గమనించి వెంటనే ఆ యువతిని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలు అందించిన ఆమె ఆరోగ్యం కుదుటపడక పోవడంతో శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే కన్ను మూసింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు

విశాలాంధ్ర-పీలేరు : కలికిరి మండలం లో మర్రికుంటపల్లే గ్రామ పంచాయతీ గజ్జల వారి పల్లె లో స్థానిక మసీదులో ప్రార్థనలు చేసి గడప గడపకు మన ప్రభుత్వం లో మరియు ఎంపీ లాడ్స్ మరియు ఎంపీపీ లాడ్స్ ద్వార 25 లక్షలు ఈ పంచాయతీ కి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మరియు ఆ గ్రామ ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేకి అభినందనలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే ఇక్బాల్ అహ్మద్ ఖాన్ మరియు పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవ రెడ్డి మరియు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కె యస్ అఫు మొహిద్దిన్ మరియు మండల కో ఆప్షన్ సభ్యులు రిశ్వన్ , బావాజీ పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర- చిన్నమండెం : రైతులు ఈకేవైసీ చేయించుకో వడం వలన ప్రభుత్వం నుండి అందే పలు రకాల సబ్సిడీలకు అర్హు లు అవుతారని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలం లోని కొత్తపల్లె రైతు భరోసా కేంద్రంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023 సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం కాబట్టీ రైతులు చిరుధాన్యాల సాగువైపు ప్రోత్సహించేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం డీడీఓ ఉమా మహేశ్వరమ్మను కొత్తపల్లె సర్పంచ్ భూమసాని అంజలి దంపతులు శాలువా వేసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ అంజలి, వ్యవసాయాధికారిణి గీత, వీఏఏ శివాంజనేయులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల పాల్గొన్నకళాశాల ప్రిన్సిపల్ డా. హర్షలతా పంకజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమం శుభపరిణామం అన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ డా. మునియా నాయక్ మాట్లాడుతూ సైన్స్ గ్రూపులలో ల్యాబ్ సౌకర్యాలు నూతన విద్యా విధానం లో వచ్చిన మార్పులు గురించి వివరించారు. కళాశాల వద్ద విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గుర్రప్ప, డా. ఫరూఖ్,కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గోపూజ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక పరిధి ముద్దనూరు రోడ్డులోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం నూతన ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా తొలిరోజు గోమాత, గంగపూజలతో పాటు మహాగణపతి పూజాది కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయానికి పోటెత్తారు. అఖండ దీపారాధన, నవగ్రహ ఆరాధన, వాస్తు మండల ఆరాధనతో పాటు నవగ్రహ జపాలు, సర్వతోబద్ర మండల ఆరాధన రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. సాయంత్రం పుట్టమన్ను తేవడం, దీక్షా హోమంతో పాటు జాలా దివాసం పూజా కార్యక్రమాలను వేదపండితులు తమ మంత్రోచ్చారణలతో జయప్రదంగా కొనసాగించారు. రాత్రి వేదస్వస్తి మంగళ హారతులతో తొలిరోజు పూజలను ముగించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంత రం శ్రీమారుతీ భజనమండలి వారు నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఓలలాడించారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూజలకు పుష్పాలను బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించారు.

మార్చి లోపు వందరోజులు పూర్తి చేయండి: ఏపీడి

విశాలాంధ్ర-రామాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో కూలీలు మార్చి చివరిలోపు 100 రోజులు పని దినాలు పూర్తి చేయాలని ఏపీడి రెడ్డప్ప నాయుడు అన్నారు. మండలంలోని కసిరెడ్డిగారి పల్లె. బండపల్లి. సుద్దమల్ల. గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు రోజుకు నాలుగు గంటలు పాటు పనిచేయాలని అన్నారు. పనులు చేసే ముందు పని పూర్తి అయిన తర్వాత తప్పనిసరిగా ఫోటోలు తీసుకోవాలని లేనిపక్షంలో కూలి డబ్బులు రావు అన్నారు. రోజు కూలి రూ 257 రూపాయలు వచ్చే విధంగా పనులు చేయాలని కూలీలకు సూచించారు. కసిరెడ్డి గారి పల్లె పంచాయతీలో ఫీడర్ ఛానల్. సుద్ధమలలో పశువుల తొట్లు. బండపల్లిలో గ్రామంలో చెక్ డ్యాంలో పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. పనులు కావలసినవారు ఆయా గ్రామాలలోని ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సురేంద్రనాథ్‌రెడ్డి, ఈసీ శ్రీకాంత్ రెడ్డి, టిఏలు బాబు, నాగేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అద్వర్యంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం 2 గ్రామసచివాలయ పరిధిలోని లక్ష్మీగారిపల్లెలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి యజమానులను ఆప్యాయంగా పలకరించి పథకాలు అందాయా లేదా అడిగి తెలుసుకుని అందని వారికి పథకాల మంజూరుకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు కలిగినటువంటి బుక్ లెట్ అందజేసి వారిలో చైతన్యం తీసుకువచ్చారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, తాసిల్దారు బి రామమోహన్, ఎంపిడిఓ సిహెచ్ నాగార్జున రావు, ఆర్ డబ్ల్యు ఎస్ డిఇఇ శివరుద్ర గౌడ్, ఏఇ కెవి రమేష్, పిఆర్ డిఇఇ తిప్పన బాల నరసింహులు, ఏఇ ఎస్ఎం భాష, జెటిఓ అనిల్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్లు, అంబటి మురళి, ఆర్ఐ మానస, ఎంపిటిసి షఫీ,ఎఓ సుధాకర్, సింగమాల వినోద్ కన్నా, కంచర్ల రమణారెడ్డి, మునిపెంచల్ రెడ్డి, బత్యాల నందగోపాల్, దొంతిరెడ్డి రాజారెడ్డి, ఇసుకపాటి నారాయణమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైద్యసిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాచిరెడ్డిగారిపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - సుండుపల్లి : గ్రామాల అభివృద్ధికి గడపకు వస్తున్నానని రాజం పేట నియోజకవర్గ శాసన సభ్యులు మేడా వెంకట మల్లిఖార్జున రెడ్డి తెలిపారు. మూడవ రోజు శుక్రవారం సుండుపల్లి మండలంలోని మంచిరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని చిన్నబిడికి మాచిరెడ్డి గారిపల్లే పంచాయతీ గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ పెన్షన్ వస్తుందా చేయూత అందుతోందా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామాలలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ మంజూరు చేయించాలని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిర్డి రామచంద్రరెడ్డి, ఎంపీపీ రాజమ్మ, జెడ్పిటిసి ఇస్మాయిల్, రామ స్వామిరెడ్డి, శివారెడ్డి, నసీమ భాను, ఆకుల శ్రీనివాసులు, అరుణ్, ఎంపిడిఓ రామచంద్ర, తహశీల్దార్ మహబూబ్‌చాంద్, అధికారులు, పాల్గొన్నారు.

పేరు మార్పు

అన్నమయ్యజిల్లా నందలూరు మండలం డోర్‌నెం.1/24 అడపూరు గ్రామానికి చెందిన షేక్ ఖలిద్ తండ్రి షేక్ మౌలాలి అను నేను షేక్ ఖలిద్ అలీగా పేరు మార్చు కొంటున్నాను. **పాతపేరు :** షేక్ ఖలిద్, **కొత్తపేరు :** షేక్ ఖలిద్ అలీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే డా. సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర -మైలవరం : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ధ్యేయం అని జమ్మలమడుగు శాసనసభ్యులు డా. మూలే సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మండల పరిధిలోని వేపరాల గ్రామంలోని సచివాలయం -1లో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ఎవరికైనా అర్హులైన వారికి అందుకుంటే సంబంధించిన సచివాలయలలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవరత్నాలు పథకం ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, నేతలు చేరెడ్డి చెన్నకేశవ రెడ్డి, మహేశ్వర రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి,యర్రబోలు భాస్కర్ రెడ్డి,వినయ్ కుమార్ రెడ్డి,రామాంజినేయులు యాదవ్,శివరామిరెడ్డి మొదలైన వారు పాల్గొన్నారు.

మరియతల్లి పాదం పుణ్య పాదం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మరియతల్లి నడయాడిన ప్రాంతమంతా పావన అవుతుందని వారి కుటుంబాలలో శాంతి సమాధానాలు వెల్లువిరుస్తాయని ప్రతి ఒక్కరూ మీ కుటుంబంలోనికి తల్లిని ఆహ్వానించి ఆరోగ్యంను ఆశీర్వాదంతో మీరును మీ కుటుంబము అంతయు ధన్య జీవితం పొందాలని, టేకూరుపేట విచారణ గురువులు ఫాదర్ ముల్లపాటి వరప్రసాద్ కోరారు. లూర్ధుమాత ఉత్సవాలు మరియాపురం కడప, దివ్యబలి పూజను రేణిగుంట విచారణ గురువులు ఫాదర్ సుసై నాదన్ సమర్పించారు. దేవుని వాక్యం విశ్వాసుల ఉద్దేశించి వరప్రసాద్ మాట్లాడుతూ కొందరి పాదాలు కుటుంబాలలో మోపితే కుటుంబాలు కుటుంబాలే అడుగంటి పోతాయని వినాశనం దాపరిస్తుందని మనందరికీ తెలుసు, మరియతల్లి పాదం మోపితే ఆ ఇంటికి అంతులేని ఆశీర్వాదాలు ఎక్కడ లేని గౌరవ మర్యాదలు వారి జన్మ సుకృతం అవుతుందని ఆయన బోధించారు. మరియతల్లికి ఎవరైనా ఇబ్బందులలో ఉంటే ఆమె చూస్తూ ఊరుకోదని ఆ కుటుంబానికి ఎటువంటి అపకీర్తి రాకుండా తల్లి కాపాడుతుందని కానా పల్లె పెండ్లి విందులో ద్రాక్షారసం కొరవ పడినప్పుడు మరియతల్లి పాదం ఆ కుటుంబంలో మోపగానే ఆ కుటుంబ స్థితిగతులు ఆమె తెలుసుకున్నదని ఆ కుటుంబ యజమానుడు ఎక్కడ అవమానం, మాటలు పడవలసి వస్తుందోనని తన కుమారుని (ఏసుక్రీస్తు) ద్వారా ఆ కొరతను తీర్చింది మరియ తల్లి అని ఆయన గుర్తు చేశారు. ఎలిజిబెతమ్మ గర్భం దాల్చినప్పుడు తనకు సేవ చేయడానికి మరియ తల్లి ఆ కుటుంబంలో అడుగు పెట్టగా ఎలిజే బేతమ్మ గర్భంలోని శిశువు గంతులు వేసను, మరియ తల్లి నడయాడిన ప్రాంతంలో జన్మించిన ఆ శిశువు పెరిగి పెద్దవాడై దైవ రాజ్య వ్యాప్తి కోసం మార్గాన్ని సిద్ధం చేయుటకు నాడు ఆమె మోపిన పాదఫలితమేనని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిని మీ హృదయం లోనికి మీ కుటుంబంలోనికి సాదరంగా ఆహ్వానించి ఆరోగ్యాన్ని అద్భుతాలను పొందాలని ఆయన సూచించారు. పూజ ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించబడిన లూర్ధుమాత తేరును పురవీధుల గుండా పరిశుద్ధ గీతాలాపన, జపాలను జపిస్తూ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు బిరుసు రాజా, కైపు చంద్ర, సురేష్, సుధాకర్, అనిల్, దేవ సహాయం, రూపేష్, జయప్రకాశ్ రెడ్డి, క్రీస్తు జ్యోతి, నిర్మల కాన్వెంట్ సిస్టర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు జోసఫ్, విజయకుమార్, లూర్ధు, ఆనంద్, అల్ఫోన్స్, విజయ్ కుమార్, విశ్వాసులు పాల్గొన్నారు.

కడప కోసం మదనపల్లెను బలిచేస్తారా..?

సిక్స్ వే లేదు. మంత్రి పదవీ లేదు. ఇప్పుడు కడప బెంగళూరు రైల్వేలైను కూడా లేకుండా చేస్తారా..?

ముఖ్యమంత్రి తీరుపై మండిపడ్డ వీసీకే పార్టీ

విశాలాంధ్ర -మదనపల్లి : మీసొంత జిల్లా అయిన కడపను అభివృద్ధి చేసుకోవడం కోసం, ఒక చరిత్రక పట్టణమైన మదనపల్లెను బలిచేస్తారా..? అంటూ, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తీరుపై వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ మండిపడ్డారు. మదనపల్లె మీదుగా వెళ్లేలా రూపొందించిన కడప - బెంగళూరు రైల్వేలైను మార్పు చేసి, కొత్త ప్రతిపాదన మేరకు ముదిగుబ్బ మీదుగా వెళ్లేలా దాన్ని మార్చాలని గతంలో ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడాన్ని, కడప ఎంపీ అవినాష్ రెడ్డి దీనిపై నిన్న ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం సమర్పించడాన్ని శివప్రసాద్ తప్పుపట్టారు. కడప - బెంగళూరు రైల్వే ప్రాజెక్టు కడప, పెండ్లిమర్రి, ఇడుపులపాయ, లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, వాల్మీకిపురం, మదనపల్లె మీదుగా కర్ణాటకలోని మదగట్ట, ముళబాగల్ నుండి కోలార్ - బంగారుపేట రైల్వేలైనులో కలిసేవిధంగా ప్రాజెక్టును కేంద్రం రూపొందించి పనులు చేపట్టిందని, పెండ్లిమర్రి వరకు పనులు పూర్తి కావడంతో, అక్కడివరకు రైళ్లు కూడా నడుస్తున్నాయని చెప్పారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కడప నుంచి ముద్దనూరు, ముదిగుబ్బ మీదుగా ధర్మవరం - పుట్టపర్తి లైనులో కలిసేలా ప్రాజెక్టు ఆకృతులు మార్చాలంటూ కేంద్రానికి లేఖ రాయడం జరిగిందని, దీనిపై కడప ఎంపీ అవినాష్ రెడ్డి నిన్న ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ ప్రతిపాదన మదనపల్లె ప్రాంత అభివృద్ధికి గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఈప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని అయన డిమాండ్ చేశారు. మదనపల్లెపై ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వైఖరి సమంజసంగా లేదని, శతాబ్దకాలానికి పైగా మదనపల్లె ప్రజల్లో ఉన్న జిల్లా ఆకాంక్షను తుంగలో తొక్కి, రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించారని చెప్పారు. ఆరు వరుసల జాతీయ రహదారిని కూడా మదనపల్లె మీదుగా కాకుండా గోరంట్ల, కదిరి, పులివెందుల మీదుగా తీసుకెళ్లారని, మంత్రివర్గ విస్తరణలోనూ మదనపల్లెకు చోటు కల్పించలేదని విమర్శించారు. కుప్పం, నరసాపురం పర్యటనల్లో వేలకోట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి, మదనపల్లె పర్యటనలో మాత్రం ఇక్కడి ప్రజలకు రిక్తహస్తమే చూపించరాని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మదనపల్లె ప్రభ మసక బారుతోందని, బెంగళూరు - కడప అమరావతి బస్సులకు మదనపల్లెలో స్టాపింగ్ కూడా లేని దుస్థితి దాపురించిందని, ఈ బస్సులకు రాయచోటిలో మాత్రం స్టాపింగ్ పెట్టారని చెప్పారు. ఇదిలా ఉండగా మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు మదనపల్లె మీదుగా వెళ్లేలా రూపొందించిన కడప - బెంగళూరు రైల్వేలైనుకూ ఇప్పుడు మంగళం పాడేస్తుండడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, దీనిపై ముఖ్యమంత్రి పునరాలోచించి, పాత ప్రతిపాదన మేరకే మదనపల్లె మీదుగా వెళ్లేలా కడప - బెంగళూరు రైల్వేలైను ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా వైకాపాకు మదనపల్లె ప్రజలు అండగా నిలిచారని, ఈవిషయం గుర్తించకపోతే, భవిష్యత్తులో వైకాపాకు భారీ మూల్యం తప్పదని శివప్రసాద్ హెచ్చరించారు.

రైతుబజార్ ఏర్పాటుతో దళారీ వ్యవస్థకు చెక్...

- రాయచోటిలోని రైతు బజార్ పునః ప్రారంభంలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రైతులు,కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉండేలా వైఎస్ఆర్ రైతు బజార్ ను అభివృద్ధి చేస్తామని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.శుక్రవారం రాయచోటి పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ సమీపంలో రూ 1 కోటి నిధులుతో నిర్మించిన వైఎస్ఆర్ రైతు బజార్ పునః ప్రారంభంలో ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల అంగళ్లును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు,వినియోగదారుల మధ్య దళారీ వ్యవస్థ ను రూపుమాపడానికి ప్రభుత్వం వైఎస్ఆర్ రైతు బజార్ లను ఏర్పాటు చేసిందన్నారు.ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం రాయచోటిలో వైఎస్ఆర్ రైతు బజార్ ను ప్రారంభించడం జరిగిందని, రైతుల అవగాహనతో నేడు పూర్తిస్తాయిలోకి రావడం హర్షదాయకమన్నారు. నియోజక వర్గ పరిధిలోని అర్హత కలిగి కూరగాయలు,పంటలు పండించుకుని కమీషన్లు లేకుండా , విక్రయించుకునే రైతులకు రైతు బజార్ మంచి వ్యాపార కేంద్రంగా మారనుందని, కొనుగోలు దారులకు కూడా రైతులు పండించి విక్రయించే తాజా కూరగాయలు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు.మొదటి రోజు పెద్దఎత్తున కొనుగోలుదారులు వచ్చేలా మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష,మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు,మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మదనపల్లె నియోజక వర్గ పరిశీలకులు హబీబుల్లా ఖాన్, వైస్ చైర్మన్ తబ్రేజ్, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన మోహన్ రెడ్డి,జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు దిన్నెపాడు రవిరాజు, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష, రామాపురం జెడ్ పి టి సి మాసన వెంకట రమణ, వైస్ ఎంపిపి రవిశంకర్ రెడ్డి,జాకీర్,జిన్నా షరీఫ్, సుగవాసి శ్యామ్,ఫయాజ్ అహమ్మద్, పల్లా రమేష్,జయన్న నాయక్,రియాజ్, భాస్కర్, ఆర్ట్స్ శంకర్, యర్రపురెడ్డి బ్రహ్మానంద రెడ్డి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, కో ఆప్షన్ అయ్యవారు రెడ్డి, షిరిడీసాయి కళాశాల డైరెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

క్యూ స్పైడర్ సంస్థకు ఎంపికైన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం మరియు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 11 మంది విద్యార్థులు క్యూ స్పైడర్ సంస్థ, ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి ఎంపికయ్యారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపిక ప్రక్రియలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి 9 మంది ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుండి 2 ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన వారికి 4 లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలియజేశారు. కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని పోటీ పరీక్షలలో ప్రతిభ కనపరచడానికి అవసరమగు అర్థమెటిక్, కమ్యూనికేషన్ స్కిల్స్ ,రీజనింగ్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ అసైన్మెంట్ భూములు గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అంగన్వాడి నిర్మాణ స్థల కేటాయింపు వేగవంతం చేయండి - జగనన్న కాలనీ లేఅవుట్ ఆన్లైన్లో పొందుపరచాలి- జిల్లా కలెక్టర్ గిరీష్ పిఎస్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రభుత్వ అసైన్మెంట్ భూములు గుర్తింపు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్వరగా ప్రపోజల్ పంపించాలని తహసీల్దార్ లను జిల్లా కలెక్టర్ గిరీష్ పిఎస్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అసైన్మెంట్ భూములు, రీ-సర్వే, క్లరికల్ కరెక్షన్స్ ఆఫ్ మాడ్యుల్స్ డిజిటల్ సిగ్నేచర్ స్టేటస్, హౌస్ సైట్స్ తదితర రెవెన్యూ అంశాలపై ఆర్ డిఓలు, తహసీల్దార్ లతో జిల్లా కలెక్టర్ గిరీష్ పిఎస్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీష్ పిఎస్ మాట్లాడుతూ అంగన్వాడి భవన నిర్మాణానికి స్థలం చూపించడంలో నిర్లక్ష్యం చేయకుండా త్వరగా కేటాయించి వచ్చే వారం నాటికి గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసైన్మెంట్ సంబంధించి ఇప్పటివరకు ఎంత భూమిని గుర్తించారు, ఇంకెంత గుర్తించాల్సి ఉంది, మొత్తం ఎన్ని ఫైల్స్ సిద్ధం చేయాలి, ఎన్ని చేశారు, ఇంకను చేయాల్సినవి ఎన్ని తదితర అంశాలలో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా ఖాతా కరెక్షన్ జాయింట్ ఎల్పీఎంస్, మ్యుటేషన్ జాయింట్ ఎల్పీఎంస్, ఖాతా కరెక్షన్ సింగల్ ఎల్పీఎంస్, మ్యుటేషన్ సింగల్ ఎల్పీఎంస్, డిజిటల్ సిగ్నేచర్ ఈ ప్రక్రియలో ఏది కూడా పెండింగ్ లేకుండా చూడాలని తహసీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే అంశంలో భాగంగా గ్రామాలలో మాడ్యుల్స్ అన్ని పక్కాగా పూర్తి చేయాలని చెప్పారు. శాశ్వత భూ హక్కు పత్రాలు, పాసుబుక్ లను అందుకున్న రైతులు ఈకేవైసీ నమోదు పెండింగ్ లేకుండా పూర్తి చేయించాలి అన్నారు. భూ హక్కు పత్రాలు ఈకేవైసీ 7750 కంప్లీట్ చేశారని, ఇంకా 2003 ఈకేవైసీ చేయాల్సి ఉందని, తహసీల్దార్ లు సీరియస్ గా తీసుకొని పూర్తి చేయాలన్నారు. వచ్చేవారం నాటికి ఎట్టి పరిస్థితుల్లో కూడా లేయర్ పెండింగ్ ఉండకూడదన్నారు. అనంతరం క్లరికల్ కరెక్షన్స్ ఆఫ్ మాడ్యుల్స్ - డిజిటల్ సిగ్నేచర్ ప్రగతి పై సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. తమ మండల పరిధిలో రీసర్వే ఎక్కడెక్కడ జరుగుతుంది, వాటి ప్రోగ్రాస్ ఎలా ఉందో వారానికి ఒక్కసారైనా ఫీల్డ్ లో వెళ్లి పరిశీలించాలని తహసీల్దార్ లను కలెక్టర్ ఆదేశించారు. జగనన్న కాలనీ లేఅవుట్ రెవెన్యూ రికార్డులోని ఆన్లైన్లో పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లను ఆదేశించారు. సోమవారం నాటికల్లా ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. జగనన్న కాలనీ లేఅవుట్ లో ఇంకా ప్లాట్ లు ఖాళీగా ఉంటే, 90రోజుల ఇళ్ల దరఖాస్తులకు అర్హులైన వారికి ఇంటి పట్టా మంజూరుతో పాటు ప్లాట్ అలాట్ చేయాలన్నారు. త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ ప్రపోజల్ మంగళవారం కల్లా పంపించాలని తహసీల్దార్ లను ఆదేశించారు. జిల్లాలో ఫారం -6 క్లెయిమ్స్ పెండింగ్ 2645, అన్ని ఫారాలు 5600 పెండింగ్లో ఉన్నాయని, త్వరగా కంప్లీట్ చేయాలి అన్నారు. ఫారం 7 సంబంధించి 2287, ఫారం 8 సంబంధించి 848 పెండింగ్లో ఉన్నాయన్నారు. జిల్లాలో 6బి 77 శాతం పూర్తి చేశారని, సోమవారం నాటికి 85% చేరుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తహసీల్దార్ లు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు.ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్ ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్ డిఓలు రంగస్వామి, మురళీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్, తహసీల్దార్ లు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో

శాఖల మధ్య సమన్వయ లోపం
లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

విశాలాంధ్ర-అట్లూరు : బద్వేల్ పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి రూ.130కోట్ల నిధులనువిడుదల చేశారు. ఈ నిధులను ప్రస్తుత పాలకవర్గం అధికార పార్టీకి చెందిన ఓ నేత రూ.130కోట్ల కాంట్రాక్టర్ను దక్కించుకొని సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పారు. సదరు సబ్ కాంట్రాక్టర్లు పనులు దక్కించుకొన్న చోటామోటా నేతలు కలిపి సుమారు రూ.47కోట్ల సిసి రోడ్ల పనులను పూర్తి చేశారు. సకాలంలో బిల్లులు రాక సతమతమవుతున్న నేపథ్యంలో అందరికీ తెలిసిందే అభివృద్ధి పనులు లేక ఖాళీగా ఉన్న కాంట్రాక్టర్లు బద్వేల్ మున్సిపాలిటీలో భారీ ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు, సబ్కాంట్రాక్టర్ల అవతారమెత్తి ఒప్పించుకొని సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇందుకోసం కాంట్రాక్టర్లు అధిక వడ్డీలతో సైతం అప్పులు చేసిన సంఘటనలు ఉన్నాయి. పనులలో వేగవంతం అంటూ తరచూ సమీక్షలు నిర్వహించే అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చేలా చాలా చోట్ల సంబంధిత పనులు పూర్తి చేయించుకోగలిగారు. అయితే దాదాపు ఏడాది కావస్తున్నా సంబంధిత బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. తమపై ఒత్తిడి తెచ్చి పనులు పూర్తి చేయించుకున్న సదరు కాంట్రాక్టర్లను అధికారులను బిల్లులు మంజూరుపై ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని వాపోతున్నారు. ఏడాది కావస్తున్నా బిల్లులకు సంబంధించి సంబంధిత అధికారులు ఎంబుక్కులు రికార్డులు చేయలేదు. తాము పూర్తి చేసి కాంట్రాక్టర్లు తమ బిల్లులు మొత్తాలు వడ్డీల చెల్లింపులకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని మరికొంతమంది కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ముఖ్యంగా పనులు చేయించుకునేంత వరకు అధికారులు సదరు కాంట్రాక్టర్లను బతిమలాడడం పిదప విస్మరించడం ఏ మేరకు సబబో ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. సకాలంలో బిల్లులు చెల్లించలేని ఎడల భవిష్యత్లోకూడా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు వచ్చే పరిస్థితి ఉండదని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

డీఈ వివరణ

డీఈ సుమన్రెడ్డిని బిల్లుల విషయమై విశాలాంధ్ర విలేకరి వివరణ కోరగా బద్వేల్ పట్టణంలో సుమారు రూ.47కోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయని గతంలో బద్వేల్లో పనిచేసిన డీఈ, ఏఈలు ట్రాన్స్ఫర్ కావడంతో బిల్లుల విషయమై కొంత జాప్యం జరిగిందని, సీసీ రోడ్ల అగ్రిమెంటు కండీషన్ ప్రకారం జీఎస్పీ స్పాట్ బిల్ అప్లోడ్ చేశామని పార్టు 2 కండీషన్ ప్రకారం ఎంబుక్కులను త్వరలో నమోదు చేస్తామన్నారు.

రహదారులే.. మా అడ్డా.!

నడిరోడ్లపై విశ్రమిస్తున్న మూగ జీవాలు

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు -ఇష్టా రాజ్యాంగా సంచరిస్తున్న పశువులు
పశువులకు ఆహారంగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం -కొరవడిన పర్యవేక్షణ.. పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

విశాలాంధ్ర -రాజంపేట: నా దారి రహదారి.. నా దారికి అడ్డు రాకండి..1990 దశకంలో ఓ సూపర్ హిట్ సినిమాలోని ప్రాచుర్యం పొందిన డైలాగ్! ప్రస్తుతం ఇదే డైలాగ్ రాజంపేట మున్సిపాలిటీలో హల్ చల్ చేస్తుంది. కాకపోతే మనుషులు కాదు.. మూగ జీవాలు అని చెప్పడంలో సందేహం లేదు.పచ్చని పొలాల మధ్య పకృతి ఒడిలో సేదతీరుతూ గడ్డిని నెమరు వేయాల్సిన పశువులు రాజంపేట మున్సిపాలిటీలో పట్టణ వీధుల్లో, మార్కెట్లో, నడిరోడ్లపై సంచరిస్తూ దొరికిన చెత్తంతా తింటూ కళాహీనంగా మారి, ట్రాఫిక్ కు అంతరాయంగా మారాయని పట్టణ ప్రజలు బహిరంగంగా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. నడిరోడ్డుపై అడ్డంగా తిష్ట వేస్తూ..వాహనదారులకు బెంబేలెత్తిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో పట్టణ ప్రజలకు ప్రతిరోజు ఈ సమస్య వేధిస్తోంది. సరిగ్గా రోడ్డు మధ్యలో పశువులు పండుకోవడంతో వచ్చి పోయే వాహనాలకు స్పీడ్ బ్రేకర్లుగా తయారవుతున్నాయి. పశువులను భక్తి భావంతో పూజించే మన సమాజంలో..ఇప్పుడు వాటికి రక్షణ లేకుండా పోతోంది.మరోవైపు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంతో పాటే దాని కడుపులోకి పంపేస్తూ.. దాని జీర్ణ వ్యవస్థను దారుణంగా దెబ్బతీస్తూ నరకం చూపిస్తున్నాం.

రాజంపేట మున్సిపాలిటీలో రోడ్లపై పశువులు ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళ వాహనదారులు, చిరు వ్యాపారులు పనులు ముగించుకొని హడావుడిగా ఇళ్లకు వెళ్లే సమయంలో పట్టణ ప్రజలకు పశువుల సమస్య వేధిస్తోంది. సరిగ్గా రోడ్డు మధ్యలో పశువులు తిష్ట వేసి వచ్చిపోయే వాహనాలకు స్పీడ్ బ్రేకర్లుగా తయారవుతున్నాయి. వీటిని తప్పించుకు పోవాలంటే ప్రజలకు గగనమౌతోంది. మార్కెట్, మారుతీ ప్రసన్న, పాత బస్టాండ్, ఆర్ఎస్ రోడ్డు వీటితోపాటు ప్రధాన వీధుల్లో రోడ్డు మధ్యలో గంటల తరబడి ఇవి నిలవడం, పండుకోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పట్టణ ప్రజానికం ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ దగ్గరకు వచ్చేంతవరకు పశువులు పండుకున్న విషయం అర్థం కానీ పరిస్థితి.వాహనాలు రాత్రిపూట కొద్దిగా వేగంగా పోతున్న సమయంలో పశువులు గుంపుగా రోడ్డుకు అడ్డంగా రావడంతో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ వాహన చోదకులతోపాటు, చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

హెచ్చరికలు సరే.. చర్యలేవి!

రోడ్ల మీదకి ఆవులను, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికలు జారీ చేసే మున్సిపల్ అధికారులు వాటిని అమలు చేయడంలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పశువుల యజమాలకు ఇచ్చే ప్రకటనల్లో రోడ్డుమీదకు పశువులను వదిలితే బంధించి గోశాలకు తరలిస్తామని చెబుతున్నారే తప్ప అమలు చేయడం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు. పశువుల యజమానులు కూడా అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని చెప్పడంలో సందేహం లేదు.

ప్రమాదంలో పశుపోషణ:

పోషణ ప్రమాదంలో పడుతోంది. వ్యవసాయదారిత జిల్లా అయినా.. జిల్లాలోనూ పశుపోషణ అంతరించిపోతుంది. పోషణ భారంగా మారడంతో పాటు ఎక్కువమంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతుండడంతో ఉన్న కొద్దిపాటి పశువులను ఆహారం కోసం బయటకి వదిలేస్తున్నారు. దీంతో పట్టణ రోడ్లపై పశువులు సంచరిస్తూ దొరికిన ప్రతి వస్తువును తింటూ.. కొన్ని సందర్భాలలో మృత్యువాత పడుతున్నాయి.ఈ పరిస్థితి పట్టణాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఆకలి కోసం షాపుల వద్ద ఏది దొరికితే దానిని ఆహారంగా తీసుకుంటూ ప్లాస్టిక్ వ్యర్థాలను తినేస్తున్నాయి. ప్లాస్టిక్ జీర్ణకోశ వ్యవస్థనే దెబ్బ తీస్తుంది.రోడ్లమీద తిరుగుతున్న పశువులను మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించలేదు. ఒక్కోసారి అయితే ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న..అధికారులకు పట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడతారో లేదో వేచి చూడాల్సిందే.

మాదక ద్రవ్యాల వలన విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకోవద్దు : ఎస్పీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) వలన విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకోవద్దు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల ప్రకారం, జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు తమ-తమ పరిధిలో ఉన్న పాఠశాల/కాలేజీ విద్యార్ధిని, విద్యార్థులకు "యాంటీ డ్రగ్ డ్రైవ్ "పై రెండవ విడత అవగాహనా కార్యక్రమం తో పాటు హెూర్డింగ్స్, ఫ్లెక్సి, పోస్టర్స్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... డ్రగ్స్ వ్యసనం యువతను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని, మత్తు పదార్థాలకు అలవాటుపడితే దుష్పరిణాలు తలెత్తి జీవితమే నాశనమయ్యే ప్రమాదముంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ జోలికి వెళ్లరాదని అవగాహన కల్పించినారు. జిల్లా లో భాగా రద్దీగా ఉన్న ప్రదేశాలలో హెూర్డింగ్ లను, గుర్తించబడిన కాలేజస్ వద్ద పోస్టర్స్ మరియు ఫ్లెక్సి లను , బస్ స్టాప్ లు మార్కెట్స్ వద్ద పోస్టర్స్ ను ఏర్పాటు చేసి స్కూల్స్ మరియు కాలేజస్ వద్ద కరపత్రాలను అందజేశారు. విద్యాసంస్థలలో డ్రగ్స్ వినియోగించే వారి గురించి 14500 నెంబర్ కు సమాచారం అందజేయాలని సూచించారు అలా సమాచారం అందించిన వారి వివరాలు గోప్యముగా వుంచబడునని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలియజేసారు.

గట్టుమీద పల్లి ఇంటి పట్టాల హద్దులు చూపండి: సీపీఐ

విశాలాంధ్ర-చిట్వేలి : సిపిఐ సీనియర్ నాయకులు చుక్కారామయ్య రెండవ కుమార్తె వివాహానికి సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, సిపిఐ చిట్వేలు మండల కార్యదర్శి తిప్పనప్రసాద్ హాజరు కావడం జరిగినది. వారు మాట్లాడుతూ చిట్వేలు మండలంలో 2017 సంవత్సరంలో తిమ్మాయపాలెం పంచాయతీ గట్టుమీద పల్లెలో సర్వే నెంబర్ 2లో ఇంటిపట్టాలు మంజూరు చేయడం జరిగినది. కానీ పట్టాలకు ఇంతవరకు హద్దులు చూపించలేదు. ఎన్నో దపాలుగా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ రాజంపేట ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన గట్టుమీద పల్లె బిసి వాసులు 2022 సంవత్సరంలో రాజంపేట ఆర్డీవో కోదండరామిరెడ్డి మండలానికి వచ్చినప్పుడు గట్టుమీద పల్లెలో ఇచ్చిన ఇంటి పట్టాలకు ఒక వారం లోపు హద్దులు చూపించాలని ఇప్పుడు ఉన్నటువంటి తాసిల్దార్కి చెప్పడం జరిగినది కానీ ఆర్డీవో ఇంటి పట్టాలకు హద్దులు చూపించమని తాసిల్దార్తో చెప్పి దాదాపు ఆరు నెలలు అవుతుంది ఇంతవరకు హద్దులు చూపించిన పాపాన పోలేదు 23.01.2023 తేదీన సోమవారం రోజున రాజంపేట సబ్ కలెక్టర్ని గట్టుమీదపల్లి విషయం గురించి కలవడం జరిగినది. సబ్ కలెక్టర్ స్పందించి తొందర్లో గట్టుమీద పల్లె విషయము పరిష్కారం చేస్తామని చెప్పి హామీ ఇవ్వడం జరిగినది. ఇంతవరకు స్పందన లేదనిగట్టుమీద పల్లి వాసులకు ఇంటి పట్టాలకు హద్దులు చూపించకపోతే తొందరలో చిట్వేలి మండల తాసిల్దార్ ఆఫీసు ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

కుష్టు వ్యాధిపై అవగాహనా కార్యక్రమం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : ఒకటవ సచివాలయం పరిధిలో కుష్టి వ్యాధి నిర్మూలన సదస్సు సర్పంచ్ యనమల సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందేశం, సర్పంచ్ సందేశం చదివి ప్రజలకు వినిపించారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి వున్న పేషెంట్స్ ను సమాజములో గౌరవ ప్రదంగా చూడాలని, వారిని శాపగ్రస్తులగా చూడరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కావున ప్రజలు కుష్టు వ్యాధి లక్షణాలు వున్న వారిని గుర్తించి వైద్య సిబ్బందికి తెలపాలని అయన అన్నారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కనురెప్పలు మూత పడక పోవటం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, అరచేతులు, అరికళ్ళలో స్పర్శ కోల్పోవడం, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు కల్గి ఉండటం, చేతి మరియు కాలి వేళ్ళు వంకర్లు తిరిగి అంగవై కల్యం కలగడం, మనకు తెలియకుండానే కాళ్ళు, చేతులలో బొబ్బలు రావడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియ జెయాలనీ కమ్యూనిటీ హెల్త్ అధికారి నిర్మలాదేవి ప్రజలను కోరారు. కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహనా కార్యక్రమాలు జనవరి 30వ తేది నుండి ఫిబ్రవరి 13వరకు ప్రతి సచివాలయం పరిధిలోని గ్రామాలలో నిర్వహించాలని పబ్లిక్ హెల్త్ నర్స్ సుకన్య తెలిపారు. పంచాయతీ ఎగ్జికూటివ్ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కుష్టు వ్యాధి నయం అయ్యే వ్యాధి అని దీనికి మల్టీ డ్రగ్ థెరపీ అందుబాటులో ఉందని ప్రజలు ఎలాంటి భయం చెందాల్సిన పని లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సుప్రియ, ఒకటవ సచివాలయం ఏయన్యమ్ చామంతి, ప్రజలు పాల్గొన్నారు.

రామగోపాల్రెడ్డి విజయం తథ్యం

విశాలాంధ్ర-వేముల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసన మండలి టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్రెడ్డి విజయం తథ్యమని ఆయన సతీమణి ఉమాదేవి ధీమా వ్యక్తంచేశారు. మండలంలోని గొందిపల్లె గ్రామంలో టీడీపీ కడప జిల్లా పార్లమెంటు కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. టీడీపీ పట్ల ప్రజలు కూడా ఎంతో ఉత్సాహం కనబరుస్తున్నారన్నారు. పట్టభద్రుల టీడీపీ అభ్యర్థి రామగోపాల్రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తూగుట్ల రాఘవరెడ్డి,నారెపల్లి రమణారెడ్డి, మాజీ సర్పంచు దయ్యం చిన్నహనుమంతురెడ్డి, లోకే పల్లె మల్లికార్జునరెడ్డి, బొజ్జ బాలగంగిరెడ్డి, బొజ్జ గంగాధర్ రెడ్డి, కర్నాటి ఓబుల్ రెడ్డి, గంగ చంద్రారెడ్డి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం తో పాటు ఎర్రచందనం స్వాధీనం

విశాలాంధ్ర-పీలేరు:-ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై లోకేష్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజు ఆదేశాలు మేరకు డిఎస్పి శ్రీధర్ పర్యవేక్షణలో వాల్మీకిపురం ఇన్చార్జి సిఐ నాగేంద్ర ఆధ్వర్యంలో ఎస్ ఐ లోకేష్ రెడ్డి, ఏఎస్ఐ మధుసూదనాచారి తన సిబ్బందితో శుక్రవారం కలికిరి కలకడ రోడ్డులోని మేడుకుర్తి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తమిళనాడుకు చెందిన పదిమంది తమ వాహనాలలో గంధపు చెక్కలు రవాణా చేస్తూ తనిఖీల్లో పట్టుబడగా, వారిలో ఏడు మంది తప్పించుకుపోయి ముగ్గురు మణి బాబు (40) కులం కుమార్ (29) పొన్ను స్వామి (30) మాత్రం పోలీసులకు పట్టు పడ్డారు. వారి వద్ద నుండి స్విఫ్ట్ కారు, పల్సర్ బైకు, 55 కేజీల 4 ఎర్రచందనం దుంగలు, గొడ్డలి మొనలు, మూడు సెల్ ఫోన్లు, 700 రూపాయలు నగదు వారి వద్ద నుండి స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. ఈ ఎర్రచందనం అక్రమ రవాణాను ఛేదించిన సీఐ నాగేంద్ర, ఎస్ఐ లోకేష్ రెడ్డి, మరియు కలికిరి పోలీస్ సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.